UNIVERSAL LIBRARY
OU_204429
UNIVERSAL LIBRARY

Osmania University Library

No T82 V83J   Accession No T 1248

ior [illegible]

[illegible]

book should be returned on or before the date last marked below

3 OCT 1998	13 OCT 1998	15 ph.d (Telugu)	

జన్మభూమి

రంగము : 1

చెట్లమఱుఁగున శిథిలమైయున్న ‘రామగిరి’ గ్రామము.
(ప్రవేశము : రాఘవరావు, శ్రీహరి)

రాఘవరావు :—

చరణంబు లెచ్చోటఁ జరియించుచున్న
హృదయ మించుకయేని సడలింపలేని
యైంద్రజాలిక బంధ మది యేదో యొకటి
మన ‘జన్మభూమి’కి మనకును గలదు.
సృష్టి నది నిరక్ష రేఖయం దున్న
ధ్రువమండలంబు నందున నొప్పుచున్న
మనసు నాకర్షించి మగ్నమ్ముఁ జేయు
నట్టి యయస్కాంత మందులోఁ గలదు.
అది స్వతంత్రునిచేత ననవరతంబుఁ
బ్రేమింపఁబడుచుండు హృదయంబునందు,
బహు కష్టజీవియై బ్రతుకుచునుండు
బానిసచే నల్లై భావింపఁబడును.

మఱియు—

పోయి గూర్చెదు సీమ లవి యెన్ని గనిన
నవరత్నమయ సదనము లెన్ని గనిన

తప్తకాంచన నికేతనములు గనిన
నాయాత్మ యంద దానంద మావహిల్లె,
ఇంద్రభోగ మనుభవించుచున్న
హర్ష వారిధి నోలలాడుచున్న
నా యంతరంగంబునను ‘జన్మభూమి’
స్మరణంబు పోనాడఁ జాలితినొక్కొ!
నా మాతృదేశమా! నా ప్రాణపదమ!
నా నాకలోకమా! నా తపఃఫలమ!
నిను గారవింతును నిన్నె పూజింతు!
నిను మది భావింతు నిన్నె సేవింతు,
వెలలేని సద్వస్తు వితతులకన్న
వసుధ మదీయ సర్వస్వంబుకన్న
నా ప్రాణమునకన్న నా మేనికన్న
నతిగాఢముగ నిన్ను నాత్మఁ బ్రేమింతు:
చెలఁగి నేను విదేశసీమలయందు
బహు సుందరోద్యానవనములయందుఁ
దీటైన కాసారతీరమ్ములందు
స్వర్ణ నిర్మిత దివ్యసౌధమ్ములందు
చెలువు గాణించు పచ్చికపట్టులందు
విహరించుచున్నను, వేగ వేగమున
నా ‘జన్మభూమి’కి నన్నుఁ గొంపోవు
వాయువునకు నేను స్వాగతం బిడుదు!

ఈ స్థలమే, ఇదియే. నా కత్యంత ప్రియతమమగు నెల విదియే. అల్లదే, నేను మిత్రులతో ‘కోఁతికొమ్మచ్చి’ యాడెడు వయసుఁ గడపిన వటవృక్షము. ఈశానదిక్కున

కాలువను చేరి కనఁబడుచున్న ఆ యిసుకతిన్నె మీఁదనే మేము 'చిడుగు' డాడెడువారలము. ఇదిగో, కుడివైపున—ఈ యీఁతచెట్టునుండియే పాపము! ఎంతయో కష్టపడి శృంగారముగ నల్లుకొనిన బంగారు పిచ్చికగూఁటిని వినోదార్థము పెకలించితిమి. ఆ ఘోరకృత్యము మఱచిపోవలెనన్నను నాకు మఱపునకు రాదు; కన్నులకుఁ గట్టినటులున్నది.—ఆ 'జంప' కాలువలో పిల్లలందఱమును పడవ త్రోయు నప్పుడది తిరుగఁబడగా దరినున్న బెస్తలు మమ్ముల నొక్కొక్కరిని పిలుకలుపట్టి యొడ్డునకీడ్చి కాపాడిరికదా! అబ్బా! ఆ దృశ్యము తలఁపునకు వచ్చిన నిప్పటికిని ఒడలు జల్లుమనును!

సుఖదుఃఖ మిశ్రితమగు హృదయాంతర్గత భావపరంపర తఱుముకొని వచ్చుచున్నదే! ఇట్టియానందము! అట్టి సంతాపము! అవునవును. బాహ్య ప్రపంచవిషయము లెల్ల నొక యెత్తుగను, స్వస్థలాభిమాన మొక యెత్తుగను తోఁచెంచి, మనసు ద్రవింపఁజేయు మహత్తర విశేషమెద్దియో 'జన్మభూమి' యందున్నది!

శ్రీహరి :—మిత్రమా! ఈ ప్రదేశముతో నీకు సంబంధమున కవసరము కనఁబడదే? మీకుటుంబమువా రెవ్వరును లేరే? నీవును చిరకాలము క్రిందటనే ఈయూరు వదలితివే? బంధుమిత్రాదులు గూడ నున్నట్లు నాకు తోఁచుటలేదు. ఎందుల కింత యభిమానము?

రాఘవరావు :—నిశ్చయమే, శ్రీహరీ! నావాఁడొక్కఁడును లేఁడు. నాతండ్రి పోయినతోడనే మిగిలియున్న యాస్తి పంచుకొని, నా యన్నలు సౌఖ్యప్రదములగు వేర్వేఱు నెలవులు చూచుకొని, నన్ను విడిచిపోయిరి.

శ్రీహరి :—మఱి, నీజీవన మెట్టుల గడపితివి?

రాఘవరావు :—మా యింటి పొరుగున నున్న ఆ వాసుదేవ శాస్త్రియు, ఆయన సతీమణి అన్నపూర్ణాదేవియు సుజ్ఞానులు. పాపము! వారికి సంతతి నిలువకుంటచే నాపైన పంచప్రాణములును పెట్టుకొనిరి. దిక్కులేని నన్ను జేరఁదీసి, సొంతబిడ్డకంటె నల్లారు ముద్దుగఁ బెంచిరి. ఆ దంపతులు బీదస్థితిలోనివారు. పౌరోహిత్యమువల్లనే కాలక్షేపము. స్వల్పమగు ఆదాయముతో నా ఇల్లాలు శ్రమపడి గుట్టుగ సంసారమెట్లీఁదుచుండెనో ఆపెకే తెలియవలె, ఆ బ్రహ్మకే తెలియవలె. 'పతివ్రత' యనిన నిశ్చయముగ నామెకే చెల్లును.—

ఆడదు భర్తమాట కెదురాడదు, వచ్చినవారి వీడఁగా
నాడదు, పెక్కుభాష లెడనాడదు, వాకిలి వెళ్లి కల్లమా
టాడదు, మిన్నకేని సుగుణావళి కిందిరగాక సాటి యే
చేడియ లేదు ధారుణిని శ్రీకర నామకు నన్నపూర్ణకున్.

ఆ దంపతు లుపవసించియైన నాసౌఖ్యముఁ జూచుచుండిరి. నాకయిదవయేఁడు రా వెంటనే కాకినాడలోని 'అనాథ శరణాలయము'లోఁ జేర్పించి విద్య చెప్పించిరి. దైవ

కృపచే నేను 'మెట్రిక్యులేషన్' పరీక్షయందు త్తీర్ణుఁడనై, నా క్షేమాభిలాషులకు సంతస మొనఁగూర్చితిని.

ఇంతలో 'ఐరోపామహాసంగ్రామము' తటస్థించినది. యుద్ధములో పాల్గొని రాజభక్తిఁ జూపవలెనను గాఢమగు నుద్దేశము నాకుఁ గలిగినది. అంతట తలిదండ్రులను స్వగ్రామమున దిగఁబెట్టి, నా యుద్యమ నిర్వహణము నకై పిట్టకయిన తెలియకుండఁగ బయలువెడలితిని.

శ్రీహరి :—సరి, సరి, అటుపై సంగతి యేమి?

రాఘవరావు :—యుద్ధములో నా ధైర్యశౌర్యములకు మెచ్చి నన్ను 'బి–1' రెజిమెంటునకు 'సుబేదార్ మేజరు'గ నియమించిరి. పెక్కు ఘనకార్యము లొనర్చి, ప్రభుత్వమువారి ప్రత్యేక ప్రశంసకుఁ బాత్రుఁడ నైతిని. ఊరు విడిచి నేఁటికి పదునైదు వత్సరముల పైమాట. నా హితైషుల నెప్పుడు – ఎప్పుడు–దర్శించి ధన్యుఁడ నగుదునా యని యువ్విళ్లూరుచున్నాను.

శ్రీహరి :—మిత్రరత్నమా! నీమాటలు ఆలకించిన కొలఁదియు నొడలు జలదరించుచున్నది. 'ఇది నా యూరు, నా జన్మస్థలము' అని మనసార తలపోసి, ఉల్లముప్పొంగునట్లు హర్షింపనట్టి హతాత్ముఁడెవ్వఁడైన నుండునా! అందును విదేశసీమలందు చిరకాలము సంచరించి గృహోన్ముఖుఁడగుచు నేతెంచు సమయమున హృదయము తహతహపడకుండునా!—

పుట్టువొసఁగిన భూమియందొక యపూజ్యుఁడు నా కిది మాతృభాష; నేఁ
బుట్టిన దేశమిద్ది యని పొంగక ప్రాణముఁ గల్గి పీనుఁగై;
పుట్టవె తల్లి కడ్పునను బుర్వులవెన్నియొ వానిలోన, నీ
కట్టిఁడి యెంచ నొక్కఁ డగుఁగాక నరుండని యెంచ దోషమా.

ఆ పుణ్యదంపతులు జీవించియుండినచో నదృష్టవంతుడవే, రాఘవా!

రాఘవరావు:—నేను ఓడ దిగిననాఁడే మన సీతాపతి కనఁబడి, వా రుభయులును క్షేమముగ నున్నట్టును, కాని ఆరోగ్యాది స్థితిగతులలో కుదికిలఁబడి యున్నట్టును చెప్పినాఁడు.

శ్రీహరి :—వారి యునికి?

రాఘవరావు :—ఇదిగో, ఈ సందు తిరుగుడులోనే. కాని, యేమిది? ఇల్లు కనఁబడదే! శిథిలమైన మొండి గోడలు మాత్ర మానవా లున్నవి. ఇక్కడనే యని నాకు చాల జ్ఞాపకము సుమా! కారణాంతరములచే నిల్లు పడిపోయి యుండవలెను! అయినను స్థలముమాత్ర మిదియే యని నా నిశ్చయము. అయ్యో! పూజ్యులారా! మీగతి యేమయినదో కదా! ఈశ్వరా!—

పాపాత్ముండను; బాపసంభవుఁడ; నేఁ బాపంబులే సల్పుదున్;
బాపిన్; బావన! పావనాత్మ! నను నిష్పాపుం బొనర్పంగదే?
నీ పాదంబులె దిక్కుగాని యిఁకఁ దండ్రీ! నాకు దిక్కేమి లే;
దాపద్బాంధవ! కావుకావు నను! దేవా! భక్తచింతామణీ!

శ్రీహరి :—రాఘవా! ఇంతమాత్రమునకే నిస్పృహ చెంద నేల? కొంచెము దూరము పోయి ఎవరినైన కను గొందము. 'నోటిలో నాలుక యున్నచో దేశములు జయింపవచ్చును'. రమ్ము.

—అదిగో! ఆవచ్చుచున్న బాలికనడిగి తెలిసికొందము.

[మహాలక్ష్మి యను బాలిక ప్రవేశము.]

రాఘవరావు —చూడు అమ్మాయీ! ఇక్కడ వాసుదేవ శాస్త్రిగారను బ్రాహ్మణు లుండెడివారు, నీకుఁ దెలియునా ?

మహాలక్ష్మి:— ఏమి? వాసుదేవుఁడుగారా? ఆ, తెలియును. అన్నపూర్ణమ్మగారిని గూడ నెఱుఁగుదును, చల్లని తల్లి. ప్రతి శనివారమునాఁడును పర్వదినములందును భజనచేసి, మాకందఱకును ప్రసాదము లిత్తురే, వారు!

రాఘవరావు:—మిత్రమా! ఏమి, ఆ మాతృశ్రీ నిరంతర భక్తి!

సిరి దూరంబయిపోవనీ! సుఖము నిశ్శేషంబుగా జాఱనీ!
పరిహాసంబులు నీసడంబులు జనుల్భాషింపనీ! రక్తముల్
దొరఁగన్ బైఁబడిమోఁదనీ! యురువిపత్తుల్గ్రమ్మి బాధింపనీ!
హరిదాసుల్భవదంఘ్రిపద్మములఁ బాయన్లేరుగా! ఈశ్వరా!

ఇందాశ్చర్యమేమున్నది!—

పూని భవత్పదాంబురుహమూల నివాసులమైన మేము మే
ధానిధి నీ విలోకనముఁ దక్కఁగ నన్యముఁ గోరనేర్తుమే

మానిత పారిజాత కుసుమస్ఫుట నవ్యమరంద గంధ శో
భానయశాలియైన మధుపంబు భజించునె యన్యపుష్పముల్.

రాఘవరావు :—(మహాలక్ష్మితో) అమ్మా! వారి బస ఎక్కడ?

మహాలక్ష్మి :—ఆ కాలువయొడ్డుననే పోయినచో చిన్న వంతెన యగపడును. దానికి తిన్నగ నున్న సందు లోని కడయిల్లే.

రాఘవరావు :—కొంతకాల మిక్కడుండిరికదా వారు?

మహాలక్ష్మి :—అవును. మొన్నటి వఱదకు ఇండ్లన్నియు నేలమట్ట మయినవి. అప్పుడు చాలమందికి 'గాంధి నగరము'లో స్థలముల నిచ్చి ప్రభుత్వమువారు కాపాడిరి. ఆ ప్రదేశము మెరక యగుటచే శాస్త్రిలుగారు కూడ నచ్చటనే చిన్న కుటీరము వేసికొని నివసించుచున్నారు.

రాఘవరావు :—కొంచెము మాతో వచ్చి యిల్లు చూపుమమ్మా!

మహాలక్ష్మి :—సరే, రండి. (వెళ్ళుదురు.)

(కొంత దవ్వరిగి)

మహాలక్ష్మి :—అల్లదిగో, ఇటికగోడ యున్న దొడ్డి ప్రక్క రెల్లు నేసిన చిన్న పాక...కనఁబడినదా? వసారాలో అన్నపూర్ణమ్మగారు రాట్నము త్రిప్పుచున్నారు. దండములండి బాబయ్యా!

(వెళ్ళిపోవును).

——

రంగము : 2

(కుటీర సమీపము)

రాఘవరావు :— శ్రీహరీ! గుండె దడదడ కొట్టుకొనుచున్నదే! ఆ కూర్చున్నది నా తల్లియేనా? అన్నపూర్ణాదేవియే! ఆ, అవును. ఆమెయే. ఎంత వృద్ధురాలై పోయినది! అయ్యో! ఎటులు శుష్కించి పోయినది! పోలిక పట్టుటగూడ కష్టముగ నున్నదే!

శ్రీహరి:—మిత్రమా! ఏఁబది వర్షము లెడ తెఱపిలేని కడగండ్లెన్నియో పడిన ప్రాణి, యిట్లు మాఱుటొక వింతయా?

[కుటీర ద్వారము]

రాఘవరావు:—అమ్మా! నమస్కారము. మాకు కొంచెము దాహమున కిచ్చి పుణ్యము గట్టుకొనఁగలవా? ప్రయాణపు బడలికచే మిక్కిలి డస్సియున్నాము.

అన్నపూర్ణాదేవి:—బిడ్డలారా! చల్లని మంచితీర్థము మాత్ర మియ్యఁగలను.

శ్రీహరి:—అదే పదివేలు, మాతల్లీ!

అన్నపూర్ణాదేవి:—అయ్యో! నాయనలారా! నెత్తి మాఁడుచున్నది, ఎండలో నిలిచెదరేల? అరుఁగులు చాలఁ జిన్నవి. అయినను ఇదిగో, యీ చదరమీఁద సరదుకొని కూర్చుండుఁడు. మీరు విశ్రాంతిఁ గైకొను లోపల నీళ్లు తీసికొని వచ్చెదను. (ఆమె వెళ్లును.)

రాఘవరావు:—ఎప్పటి సదయహృదయయే కదా! శ్రీహరీ! రమ్ము, అరుఁగుపైఁ గూర్చుందము.

రంగము : 3

(కుటీరములో నొక ప్రదేశము : ఒక ముసలి బ్రాహ్మణుఁడు)

శ్రీహరి:—దాహము మిక్కుటముగ నున్నందున అవ్వగారికి శ్రమ యియ్యక తప్పినది కాదు తాతగారూ!

వాసుదేవశాస్త్రి:—కూర్చుండు, నాయనా! కూర్చుండు. నేను లేచి యీ తివాసి యిత్తమన్న లేవలేను; దృష్టికూడ ఆనదురా, తండ్రీ!

రాఘవరావు:—మిత్రమా! ఎట్టి దుర్భరస్థితి!

వాసుదేవశాస్త్రి:—ఏమి చేయుదును బాబూ! వార్ధకము దప్పించుకొన, నరమాత్రు లశక్తులుగద!

కనులు గనరావు, వీనులు వినఁగరావు,
పండ్లు పోవునో పెదపెద్ద గండ్లుపడునో,
యతిశయించు నింద్రియవాంఛ, లడఁగు శక్తి,
నమ్మ! భూలోక నరకంబు సుమ్మి! ముదిమి.

శ్రీహరి:— తాతగారూ! 'తెక్కాడినఁగాని డొక్కాడ'ని స్థితిలోనుండిరి కాఁబోలును, పాపము!

వాసుదేవశాస్త్రి:—నాయనా! జవసత్వము లుండినన్నినాళ్లు ఒడలు దాఁచుకొనక పాటుపడితిని. ఇపుడు బయటికి పోయి ఆర్జింప నశక్తుఁడను. వారి ధర్మమా యని

తమ వేదపాఠశాలలోఁ బదివత్సరములు పని చేయుటచే, ప్రభువులు మా పోషణమునకై నెలకు మూఁడు రూపాయలు 'పింఛను' యిచ్చుచున్నారు. నా సతి చక్కఁగ నూలు వడుకును. నెలకొకసారి తయారైన నూలంతయు 'సబర్మతి ఆశ్రమము'న కంపుచుందుము. దీనివలన సగటున రోజునకు ముక్కాని మాత్రము కిట్టుచున్నది. ఏదో, వేడినీళ్లకు చన్నీళ్లు తోడు! అయినను, కఱవు దినములలో ఈ కొలఁది యాదాయ మేమూల, బాబూ?

(నిట్టూర్పుతో) రామయ్యాతండ్రీ! సీతమ్మతల్లీ!—

ఆటలు మాకు బాల్యమున, యౌవనమం దెలనాగతోడ స
య్యాటలు, వానివెన్కను నిరంతర సంసరణప్రయాసముల్,
గాటపుఁజింతలామయ వికారము లంతమునందున స్జగ
న్నాటకసూత్రధార! రఘునందన! నీకిది చిద్విలాసమా!

శ్రీహరి:—'ధనమూల మిదం జగత్త'ని పూర్వు లెంత యనుభవముపై చెప్పినారు! డబ్బులేనివాని బ్రదుకెంత హేయము!—

బువ్వ లేనట్టివారికి బుద్ధు లెన్ని
చెప్పఁబట్టునె పెడచెవిఁ జేరుగాక
'భుక్తి కుదురక కుదురదు ముక్తి'యనెడు
మాట దలపోయఁగా నట్టి బూటకంబె?

మీవంటి సత్పురుషుల నిట్టి తీవ్ర పరిశోధనమునకు గుఱిచేసి 'దారిద్ర్య దేవత' కప్పగించిన సృష్టికర్తకు 'ఆప

ద్బాంధవ' బిరుద మెట్లు సార్థకమగునో యూహింపఁ జాలకున్నాను.

వాసుదేవశాస్త్రి:—అయ్యా! కాల ప్రవాహమున కెదురీఁద నేరి శక్యము?—

వాయువశంబులై యెగసి వారిధరంబులు మింటఁ గూడుచుం
బాయుచునుండు కైవడిఁ బ్రపంచము సర్వముఁ గాలతంత్రమై
పాయుచుఁ గూడుచుండు నొక భంగిఁ జరింపదు కాల మన్నియుం
జేయుచునుండుఁ గాలము విచిత్రము దుస్తర మెట్టివారికిన్.

శ్రీహరి:—చక్కని హితబోధము చేసితిరి తాతగారూ! కాని, నా కొక యూహ స్ఫురించుచున్నది. మనసు విడిచి మాటాడిన మన్నింపుఁడు: మానవజీవితములో పోటుపాటులు రాకతప్పదు. పొంగి పొరలు ఉచ్చదశలోనే యావచ్ఛక్తియు వినియోగించి మేలుకొంటి మేని భవ్యపథమునఁ జేరుదుము; అనఁగా కీళ్ళాడు దినములలోనే నాలుగు రూకలు జాగ్రత్త పెట్టుకొనవలెను. లేనిచో జీవయాత్ర అయోమయమయి దారిద్ర్యపీడితులమై ఎన్నో యిక్కట్టులు పొందవలసి వచ్చును.

వాసుదేవశాస్త్రి:—ఓయీ! వెఱ్ఱివాఁడా! యువకున కుండు సహజసాహసముతో నీవు స్వశక్తి నాధారము చేసికొని ప్రసంగించుచున్నావు; ఇంకను అనుభవము తక్కువ, నాయనా!

'కలనాటి ధనము లక్కఱ
గలనాఁటికి దాఁపఁ గమలగర్భుని వశమా?
నెలనడిమినాఁటి వెన్నెల
యెలవడునే గాదెఁబోయ నమవసనిసికిన్?'

అని చెప్పిన కవీశ్వరుని అమూల్యవాక్యరత్నములు నీవు పఠించి యుండలేదా?

అన్నపూర్ణాదేవి:—(మంచితీర్థము తెచ్చి) అయ్యా! ఈ పాత్రలు తీసికొని దాహము పుచ్చుకొనుఁడు. పాపము! ఎంత దవ్వునుండి వచ్చితిరో! చప్పున రాలేకపోయితిని; పెద్దదానను, నాయనా!

(వారు దప్పికఁ దీర్చుకొందురు.)

మా యవస్థ యేమని చెప్పుకొందుము, బిడ్డలారా!—

కలఁడందురు దీనులయెడఁ
గలఁడందురు పరమయోగిగణముల పాలం
గలఁడందు రన్నిదిశలను
గలఁడు కలండనెడువాఁడు గలఁడో లేఁడో!

సంతతి నెల్ల దిగమ్రింగి, దిక్కులేక యిటులు జీవచ్ఛవములమై యున్నారము.

రాఘవరావు:—దగ్గఱబంధువులు గాని, స్నేహితులుగాని యెవ్వరును లేరా అమ్మా, మిమ్మాదరించుటకు?

అన్నపూర్ణాదేవి:—లేరు నాయనా! కన్నబిడ్డలు బ్రదుక కున్నఁ బోయిరి; మా పొరుగున తలిదండ్రులఁ

గోల్పోయి నిస్సహాయుఁడైన ముద్దుబాలునిఁ దెచ్చి
గారాబముతోఁ బెంచి మా సర్వస్వ మతఁడే యని
నమ్మితిమి. వాఁడయినఁ దక్కకపోయెనే యని
అహోరాత్రములు విలపించుచున్నాము.

రాఘవరావు:—అతని పేరేమమ్మా?

అన్నపూర్ణాదేవి:— (కన్నీటితో) పేరెందులకు నాయనా! అతనితోనే పోయినది పేరు. మంచి రూపసి. వినయవివేకసంపన్నుఁడు. సీమమిరెపకాయవంటి చుఱుకుఁదనము. ధైర్యసాహసము లాతని సొమ్ము. సుగుణఖని. పరీక్షలో జయ మొందెనని యెంతయొ ఆనందపడితిమి. ఏమి సార్థకము? కడ కంతయు 'బూడిదలోఁ బోసిన పన్నీ'రైనది. వార్ధకములో పోషించునని నమ్ముకొనియున్న మమ్ముల నిరాశులఁ జేసి యీస్థితికిఁ దెచ్చినాఁడు.

వాసుదేవశాస్త్రి:— ఇంతకును మన కర్మఫల మిట్లుండ ఆ చిన్నిబాలుని నిందించు టేల?

కర్మములు మేలునిచ్చును
గర్మంబులు గీడునిచ్చుఁ గర్తలు సుమ్మీ
కర్మములె బ్రహ్మకైనను
గర్మగుఁడై పరులఁ దడవఁగా నేమిటికిన్.

రాఘవరావు:—తల్లీ! అతఁడేమి చేసిపోయినాఁడు?

అన్నపూర్ణాదేవి:—చేయుట కేమున్నది, బిడ్డా? యుద్ధములోనికి పోయెనని చూచినవారు చెప్పఁగా, మాకు

గుండెలు బ్రద్దలైనవి. అప్పటినుండియు నతని సంగతి తెలియనే లేదు.

వాసుదేవశాస్త్రి :—తప్పక రణరంగమున హతుఁడైనాఁడు. మనలనే తలిదండ్రులుగ భావించు నా బిడ్డఁడు జీవించియే యున్నచో, మన క్షేమ మారయ కుండునా? ఇంతకాల ముపేక్ష సేయఁడు. అయినను ఈ దీర్ఘచింత యేల?—

> ఈశ్వరుండు విష్ణుఁ డెవ్వాఁ డెవ్వాని
> కేమి సేయఁ బురుషుఁ డేమి యొసఁగు,
> నతని మాయలకు మహాత్ములు విద్వాంసు
> లడఁగి మెలఁగుచుండ్రు గంధులగుచు.

అట్టియెడ, నీ విశాలప్రపంచమున మన మొక లెక్కయా?

అన్నపూర్ణాదేవి :—(గద్గదస్వరముతో) ఎంతపని జరిగినదోయి తండ్రీ! మమ్ముల నెంత మోసము చేసితివిరా బిడ్డా!

వాసుదేవశాస్త్రి :— సాధారణముగ ప్రజాసామాన్యమును ముంచు అజ్ఞానమే నిన్నును ఆవరించినది. కాలవైపరీత్యమును బట్టి పెద్దలు పిన్నలకు నీళ్లు వదలుట వికృతమే, కాని ఎవ్వరమైనను 'ఉట్టి కట్టుకొని యూఁగుదుమా' యేమి?—

> మచ్చిక వీరి కెల్ల బహుమాత్రముఁ జోద్యము దేహి పుట్టుచుం
> జచ్చుచు నుంటఁ జూచెదరు, చావక మానెడువారిభంగి నీ
> చచ్చినవాని కేడ్చెదరు, చావునకొల్లక డాఁగవచ్చునే?
> యెచ్చటఁ బుట్టె నచ్చటికి నేఁగుట నైజము ప్రాణికోటికిన్.

ఐహికబంధముల నంటిపట్టుకొని ప్రాకులాడు నన్నాళ్లు మనము నిత్యానందమును పొందఁజాలము. కాన, ఇట్టి సంభవములు మంచిగనే పరిణమించి మనలను కను విప్పునట్లుగఁ జేయును. తాత్కాలిక సంతాపము సహజము.—

కడలే దాశాలతకుం,
గడఁజూడఁగ జేరరాదు కడఁ గనిరేనిం
గడుముదమున సంసారము
కడఁగంగురు తత్త్వవిదులు కమలదళాక్షీ !

ఇంతకును, ఒక్కసంగతి ఆలకింపుము :—

దేహము వాయుసంచలిత దీపిక, పుత్త్రికళత్రమిత్రసం
దోహము స్వప్నకాలమునఁ దోఁచెడు సందడి, రాజ్యభోగ స
న్నాహము జంత్రపుం బ్రతిమ నాట్యము, సంపద యింద్రజాల ; మీ
యైహిక సౌఖ్యమేమి సుఖమంచుఁ దలంపుదుమయ్యొ ! ప్రేయసీ !

వాఁడు 'వీరస్వర్గము'నంది ధన్యుఁడైనాఁడు, కావున నెంత మాత్రము విచారింపవలసిన పనిలేదు.

అన్నపూర్ణాదేవి :—మీ వేదాంతము ఈ యజ్ఞురాలి నూఱడింపఁ జాలకున్నది. 'కన్నప్రేమకంటె పెంచినప్రేమ యెక్కుడు' గదా ! నా శోకాబ్ధికి దరి గనలేకున్నాను.

(కన్నీటితో) అయ్యో ! అయ్యో ! కొడుకా !—

మేను మృదుశయ్య సగము నామేనిమీఁద
సగముగాఁ జేర్చికొని ముద్దు మిగుల నిద్ర

సేయునట్టి నీ విప్పుడు చెనఁటి నేలఁ
దనువు వొందుట కోర్చితే తండ్రి ! చెపుమ.

నిశ్చయముగ దేవుడున్నాఁడా! ఉండియేయున్నచో—దయామయుఁడను మాటయే సత్యమైనచో—దీనురాలి నిట్లు ఉపేక్షించునా! ఇట్టి ఘోరమగు కడగండ్లకుఁ బాల్పడఁ జేయునా! అంతటి క్షమింపరాని పాతకము లొనరించి యుంటినా!—

కలుగఁడే నాపాలి కలిమి సందేహింపఁ
గలిమి లేములు లేక కలుఁగువాఁడు
నాకడ్డుపడరాఁడె నలి నసాధువులచేఁ
బడిన సాధుల కడ్డపడెడువాఁడు
చూడఁడే నాపాటుఁ జూపులఁ జూడక
చూచువారలఁ గృపఁ జూచువాఁడు
నిలతో నా మొఱాలింపఁడే మొఱఁగుల
మొఱ లెఱుంగుచుఁ దన్ను మొఱఁగువాఁడు
అఖిలరూపముల్ దనరూప మైనవాఁడు
ఆదిమధ్యాంతములు లేక యడరువాఁడు
భక్తజనముల దీనుల పాలివాఁడు
వినఁడె చూడఁడె తలఁపడె వేగరాఁడె!

దైవమా! నా ప్రార్థన లరణ్యరోదనము లేనా?– ఉహుఁ!– ఇఁక నీ సంతాపము భరింపజాలను!–భరింపజాలను!–

ఎవరింజేరుదు? నెందుఁజొత్తుఁ? దెరువే! దేలాగు మాలాగు? ది
క్కెవ్వ? రీఘోరభవానలార్చులకు నే? క్లేఁ దప్పుదుం? జాలి ద

ల్పవె; చిచ్చార్పవె; యశ్రువుల్ దుడువవే; పాలింపవే; దీన బాంధవ! యార్తావన! యోకృపార్థి! పరమాత్మా! భక్తచింతామణీ!

రాఘవరావు!—(శ్రీహరితో) ఇఁక సత్యము దాఁపజాలను మిత్రమా! కడుపు తఱుగుకొనిపోవుచున్నది.

శ్రీహరి:—(రాఘవరావుతో) కొంచె మోపిక పట్టుమోయి: (వారితో) తాతగారూ! మాకు దాహముఁ దీర్చినందుల కివే వందనములు. కృతజ్ఞతా సూచకముగ మీకత్యానందదాయకమగు శుభసందేశ మొకటి దెల్పెదను. ఈ రాఘవరావుగారే......

అన్నపూర్ణాదేవి:—ఆ! ఏమి నాయనా! అదే, అదే మా వాని పేరు. వాఁడు బ్రదికియున్నాఁడా?

వాసుదేవశాస్త్రి:—(ఆమెతో)—

ఆయనను పూర్తిగఁ జెప్పనిమ్ము.

శ్రీహరి:—మీరాఘవరావు సజీవుఁడై క్షేమముగ నున్నాఁడు. అవ్వగారూ! చక్రవర్తిగారి సేనయందున్నతోద్యోగము వడసి, శాశ్వతకీర్తి సంపాదించినాఁడు.

సంతతి లే దనియెడు ఘన
చింతనముల నరసి ముదిసి చిక్కిన మీకున్
సంతతి గలిగెను భాగ్యము
సంతతిహీనులకు సౌఖ్య సంతతి గలదే?

వాసుదేవశాస్త్రి:—ముసలివారమని మమ్ములఁ బరిహాసించుచున్నావా నాయనా!

శ్రీహరి :—తాతగారూ, ఎంతమాట! తమవంటి పెద్దలతో నాకుఁ బరియాచకములా? రామరామ! ముమ్మాటికి నిజమే. ఒట్టు పెట్టుకొని చెప్పుచున్నాను, నమ్మెదరా?

అన్నపూర్ణాదేవి :—ఆహా! దైవకృప! ఈశ్వర ప్రసాదము! ఈ కన్నులకు వానిఁ జూచు భాగ్య మెన్నఁడయిన లభించునా!

వాసుదేవశాస్త్రి :—ఈ జన్మమున కింతకంటె వలయు నదృష్ట మెద్ది? ఈశ్వరా!—

నీమాయఁ దెలియ వారలె
తామరసానన సురేంద్ర తాపసులైనన్
ధీమంతులు నీ భక్తసు
ధామాధుర్యమునఁ బొదలు ధన్యులు దక్కన్.

శ్రీహరి :—(రాఘవుని చూపించుచు) అమ్మా! అవ్వగారూ!—

వచ్చిన బాలుఁడు గ్రమ్మఱ
వచ్చిన క్రియ వచ్చెఁ బెక్కు వర్షములకు నీ
సచ్చరితు నేఁడు గంటిమి
చెచ్చెర మున్నెట్టి తపము సేయంబడెనో!

రాఘవరావు :—తల్లీ! వీఁడే మీ రాఘవుఁడు! వీఁడే మీ చేతులలోఁ బెరిఁగిన రాఘవుఁడు! మీ ఋణము సుంత యైనఁ దీర్చుకొనుటకు తహతహపడుచు వచ్చిన రాఘవుఁడు వీఁడే!

అన్నపూర్ణాదేవి :— (కౌఁగిలించుకొని, ఆనందబాష్పములతో) ఆ! ఏమిరా, నాయనా! నీవు నా రాఘవుఁడవే!—

నన్నుఁ గన్నతండ్రి! నాపాలిదైవము!
నా తపఃఫలంబ! నా కుమార!
నాదు చిన్నివడుగ! నా కులదీపక!
రాఁగదయ్య, భాగ్యరాశివగుచు.

నీ నగవులు, నీ మూడ్కులు,
నీ నానావిహరణములు నీ ధ్యానంబుల్
నీ నర్మాలాపంబులు
మానసముల నాటి నేఁడు మగుడవు తండ్రీ!

వాసుదేవశాస్త్రి :— అదిగో! అదిగో!! సరిగా మా బాబు రాఘవుని స్వరమే!—నాయనా! నాకు చూపానదు. ఇటు వచ్చి ఒక్కసారి తొడపైఁ గూర్చుండు బాబూ!

(రాఘవరావు కూర్చుండును)

వాసుదేవశాస్త్రి :— (రాఘవుని శరీరము నిమురుచు) నీ సుందర రూపముఁ జూచి యానందించుటకీ పాపిష్ఠపు కన్నులు నోచుకొనలేదుగదరా తండ్రీ!

రాఘవరావు :— నేను వచ్చువఱకునైన మీ దృష్టి నిలిపి యుంచఁగూడదా నాయనగారూ, ఆ నిర్దయుఁడైన బ్రహ్మ?

వాసుదేవశాస్త్రి :—చింత పడకుము నాయనా! కర్మఫలము తప్పదే—

రాకన్నానవు హానివృద్ధులు మహారణ్యంబులో డాఁగినన్
పోకన్నానదు దేహ మేవిధమునన్ బోషించి రక్షించినన్
కాకన్నానవు పూర్వజన్మకృతముల్ కొంగల్గు నర్థంబులున్
లేకన్నానవు ఎంత జాలిపడినన్ లేముల్ సిరుల్, రాఘవా!

రాఘవా! నీవు నా రాఘవుఁడవే. పూర్తిగ నమ్మితిని. పరమానందమైనది. కాని, ఎంత కాలమైనదిరా బాబూ, నీమృదుతనుస్పర్శమువలని తన్మయత్వమును చెంది! ఇట్టి సుకుమారుఁడ వెటులా కఱకు యుద్ధమునకుఁ బోయి నెగ్గి వచ్చితివో గద!

రాఘవరావు:—నాయనగారూ! మిమ్ము వీడి నేఁటికి పదునైదు దీర్ఘవత్సరములు దాఁటినవి. నేను "బస్సరా" నుండి వచ్చి దేశములో కాలుపెట్టి మూఁడు దినములైనది.

వాసుదేవశాస్త్రి:— ప్రేమమూర్తి నిన్నెంత త్వరితముగ తెచ్చెనురా బాబూ, మా చెంతకు?

అన్నపూర్ణాదేవి:— (రాఘవుని జేరదీసి) ఎంతవాఁడవైతివిరా నాయనా! రాఘవా! నీ శరీరమెంత మార్పుఁ జెందినను, సహజ సౌందర్యము మాత్రము చెక్కుచెదరక నిలిచియున్నదిరా, కొడుకా!

వాసుదేవశాస్త్రి:—ఆ రెండవవారెవరు, బాబూ!

శ్రీహరి:—ఇట్టి దివ్య వైభవముఁ గాంచుటకు వచ్చిన పథికుఁడను, తాతగారూ!

రాఘవరావు:— నాయనగారూ! ఇతఁడు నా బాల్యమిత్ర రత్నము, శ్రీహరి. మీవలెనే ఇతఁడును నా శ్రేయోభిలాషి.

అన్నపూర్ణాదేవి:— అటులా, బిడ్డా! ఆయన పేరను మాత్రమే శ్రీహరి కాఁడు. జగన్నాటకసూత్రధారుఁ

డగు నా మాయ శ్రీహరియే ఈ రూపమున వచ్చి మనకు శుభయోగముఁ గావించినాఁడు. 'నీ మిత్రుఁడు శీఘ్రముగ బిడ్డలతండ్రి యగుఁగాక!' యని మన సార దీవించుటకంటె వేఱేమి ప్రత్యుపకారము చేయఁ గల దీ పేదరాలు ?

శ్రీహరి :—ఇంకను పెండ్లియే లేనిదే! —(నవ్వుకొనును.)

అన్నపూర్ణాదేవి :—ఆహా! కృపాసముద్రుఁడగు భగవంతుని మహిమలు దుర్విజ్ఞేయములు గదా! దుఃఖము పట్ట లేక ఆయనను దూలనాడి పాతకమున కొడిగట్టు కొంటిని, ఎంతటి మూఢురాలను.—

కమలదళాక్ష దుఃఖులయ కారణమై తగు తావకీన రూ
పము ననివార్య దుర్భర విపద్దశ దుఃఖము నొందు మాకు నీ
సుమహిత సత్కృపాగరిమఁ జూపుటకంటె ననుగ్రహంబు లో
కమునఁ దలంప నొండొకటి గల్గునె భక్త ఫలప్రదాయకా!

వాసుదేవశాస్త్రి :— కాలచక్ర మెట్లు తిరుగవలెనో, ప్రతి జీవికిని పరమాత్ముఁడు నిర్ణయించియే యుంచినాఁడు. ఆ రహస్యముఁ దెలిసికొన మానవమాత్రుల కసాధ్యము.—

అరయఁగ క్షుద్రభూత హృదయంబుల యందున నంతరాత్మవై
తిరముగ నుండు నీవు భవదీయ పదాంబురుహద్వయార్చనా
పరమతులైన మాహృది శుభప్రదభూరి మనోరథంబు లీ
డేఱఁగ వె భక్తలోక హృదయేప్సితదాయక ముక్తినాయకా!

రాఘవరావు :—తల్లీ! ఈ పదునైదు వత్సరములును మీరె న్నెన్ని యిక్కట్టులు పడవలసి వచ్చెనోకదా! మీ యుభయులకును ఎట్టి హృదయవేదన గలిగించి, పాపము గట్టికొంటిని! జననీ జనకులారా! ఆపదలు కాపురముండునా? శ్రీహరి కృపవలన ఈ క్షణముతో మన కష్టములు గట్టెక్కినవని నమ్ముచున్నాను. మీ పరి చర్యలు దప్ప నాకిఁక వేఱు పని లేదు.

వాసుదేవశాస్త్రి :—పరమ సంతోషము, బాబూ! కాని పొరుగూరిలో నున్న నీ సోదరులకు అం-డ-గా—

రాఘవరావు :—నాయనగారూ! ఆమాటమాత్ర మెత్తకుఁ డని ప్రార్థించెదను. ఈ లోకములో నా కితర విష యము లన్నియు మీ తరువాతివే. మీ ఋణముఁ దీర్చుకొనుటయే నాకు జన్మసాఫల్యము. 'నాది' యనునది దొక్క పైస యున్నను, మీసౌఖ్యము కొఱకే వినియోగింతును. దిక్కులేని పక్షిని చేరఁదీసి, యింతవానిఁ జేసిన మీరలుగాక మఱెవ్వరు నాప్రత్యక్షదైవతములు! మిమ్ములను విడనాడుదునని కలనైనఁ దలఁపకుఁడు.

అన్నపూర్ణాదేవి :— నీ జాలిగుండె నే నెఱుఁగనిదా నాయనా! నాచిట్టి రాఘవుఁడు వచ్చి యెప్పటికయిన మమ్ముఁ బోషింపకపోవునా యను ఆశ నే నెప్పుడును వీడలేదురా బిడ్డా!

రాఘవరావు :— అమ్మా! మన మీ పాడుకొంప వదలి వెంటనే మంచి బసకుఁ బోవలెను. రైలుపేటలో వెంకటరావుగారి యిల్లు ఖాళీ యైనట్లు వింటిని, కనుఁ గొని వచ్చెదను. ఇచట దొరకనిచో సౌఖ్యప్రదమగు మఱొక యూరు పోవుదము తల్లీ !

వాసుదేవశాస్త్రి :— నాయనా! ఈగ్రామముననే తగిన యిల్లు కుదుర్పుము. 'జననీ జన్మభూమిశ్చ, స్వర్గాదపి గరీయసి' అను విజ్ఞుల సూక్తులు నిరంతరస్మరణీయ ములు గద! కాన, 'జన్మస్థలమున' నీ చేతులమీఁ దుగ మట్టియగుటయే నాకు మిగిలియున్న కోరిక.

అన్నపూర్ణాదేవి :—రాఘవా! మీతండ్రిగారి యభీష్టము నెరవేర్చుటయే నాకుఁ గావలసినది.

రాఘవరావు :—ఇంతకంటె నాకుమాత్రము కావలసిన దేమి? తప్పక యటులే కానిండు. మీ యిష్టమే నా యిష్టము. ఇపుడు నే మాటాడఁబోవు నింటికి హంగు లన్నియు కుదిరియున్నవి. ముందు వెనుకల. పెరడు, పశువులసాల, స్నానపుగది, ఇంక నెన్నియో సదుపా యము లున్నవి.

వాసుదేవశాస్త్రి — అబ్బో, అంత యిల్లే! కానిమ్ము. పది మందికి సరిపడునటులు 'భజనకూటము' మాత్రము చక్కఁగ నమర్చుట నాకు హితము, నాయనా!—

'చేతులారంగ శివునిఁ బూజింపఁడేని,
నోరునొవ్వంగ హరికీర్తి నుడువఁడేని,

దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁ డేని,
కలుగ నేటికిఁ దల్లుల కడుపుఁ జేటు'

అనికదా కవిసార్వభౌమ పోతనార్యుని దివ్యబోధము! అదియే నాకు చిన్ననాఁటినుండియు నమృతోపమానోపదేశమైనది. అదియును గాక,—

నారాయణుని దివ్య నామాక్షరములపై
కరఁగని మనములు కఠిన శిలలు
మురవైరి కథలకు ముదితాశ్రురోమాంచ
మిళితమైయుండని మేను మొద్దు
చక్రికి మ్రొక్కని జడుని యౌదలనున్న
కనక కిరీటంబు కట్టెమోపు
మాధవార్పితముగా మనని మానవు సిరి
వన దుర్గ చంద్రికా వైభవంబు
కైటభారి భజన కలిగి యుండనివాఁడు
గాలిలోన నుండి కదలు శవము
కమలనాభు పదముఁ గనని వాని బ్రదుకు
పసిఁడికాయలోని ప్రాణి బ్రదుకు.

కనుక రాఘవా! ఇతరాలోచనములు కట్టిపెట్టి నా కోరిక నెఱవేర్పుము బాబూ!

రాఘవరావు :—నాయనగారూ!—

పనుపక చేయుదు రధికులు
పనిచిన మధ్యములు పొందుపఱతురు, తండ్రుల్
పనిచెప్పి కోరిపనిచిన
ననిశము మాఱాడు పుత్రు లధములు తండ్రీ.

మీ మనస్సు కనిపట్టి యాచరింపఁజాలక పోయినందులకే కించ
పడుచున్నాను ; తాము తెలిపిన తరువాతకూడ నభీ
ష్టము నెఱవేర్పకుందునా? తప్పక శిరసావహించెదను.

ప్రహరి :— 'పితృవాక్య పరిపాలక' బిరుదాంకితుఁడగు ఆ
త్రేతాయుగపు రాఘవుని పావనచరిత్రము పురాణ
పఠనముచే విని యానందించితిమి. కలికాలమున
గూడ ధర్మము పూర్తిగ నశింపలేదని తార్కాణించు
మన రాఘవుని ఆదర్శదివ్యచారిత్రము కనులార
గాంచి ధన్యత నొందితిమి. తాతగారూ! తా మెంతటి
పుణ్యాత్ములు! జీవిత చరమభాగమున నిట్టి ఉచ్చదశ
లభించుట ఎన్ని జన్మముల పూజాఫలమోగద! పలు
మాట లేల!—

ఇహసుఖలోలత హెచ్చిన యీనాఁడు
నిత్యలేఖాతతి నెత్తిమీఁద
యాచూవరముసేయు నద్భ్యులనోటను
దుర్వార్త చెవులలోఁ దూఱుతఱిని
ఱట్టు గుమ్మముదాఁకి బొప్పిగట్టిన వేళ
నుస్సని వేసారి యూర్చునపుడు
గొల్లసుద్దులయందుఁ గోవెలలందును
వేదువ నఱచేత వ్రేళ్ళకొనల
భజనగానంబులను భక్తవరులజిహ్వ
సత్కవుల కావ్యనాటక సమితియందు
నాకసమువోలె వ్యాపించు నట్టి పూత
నామము ధరించు మిత్రు నెన్నంగఁదరమె!

రాఘవరావు :— శ్రీహరీ! పొగడ్తల కుప్పొంగువాఁడను కానని తెలిసియు, నిట్టిధోరణితో ప్రసంగించుట భావ్యమా?

శ్రీహరి :—ముఖస్తుతి కాదు మిత్రమా! ఉన్నది యున్నటులే వాకొంటిని.

అన్నపూర్ణాదేవి :— ఇన్ని శుభసమాచారముల నడుమ నా కెడతెగని యశ్రుధారలు పొరలి పాఱుచున్నవదేమో! నాయనా, రాఘవా! నీ కా జగద్రక్షకుఁడు నీవంటి సుపుత్రరత్నములనే ప్రసాదించి ప్రోచుఁగాక!—

హారికిం బట్టపుదేవి, పున్నెముల ప్రోవ, ర్థంపుఁ బెన్నిక్క, చం
దురు తోఁబుట్టువు, భారతీ గిరిసుతల్ దోనాడు పూబోఁడి, దా
మరలం దుండెడి ముద్దరాలు, జగముల్ మన్నించు నిల్లాలు, భా
సురతన్ లేములు వాపు తల్లి, సిరి యిచ్చున్ నిత్యకళ్యాణముల్.

వాసుదేవశాస్త్రి :— తథాస్తు! తథాస్తు!! చిరాయురారోగ్యైశ్వర్యాభివృద్ధిరస్తు!!!—

దీనుల కుయ్యాలింపను
దీనుల రక్షింప మేలు దీవనబొందన్
దీనావన! నీ కొప్పును
దీనపరాధీన దేవదేవ మహేశా.

రాఘవరావు :—

తనదేశంబు, స్వభాష, నైజమత, మాతృ ప్రాక్కులాచారముం,
దన దేహాత్మల వె త్తెఱంగున సదా దానట్లు ప్రేమించి, త

ఘ్నతావ్యాప్తికి సాధనంబులగు సత్కార్యంబులన్ సల్పఁగా
ననునొబుద్ధి యొసంగు నీ ప్రజకు; దేవా! భక్తచింతామణీ!

శ్రీహరి :— నేఁడుగదా ధన్యుల మైతిమి! ఎట్టి సుదినము!
మా రాఘవునకు తప్పక జయమగుఁగాక!! ముమ్మాటి
కిని జయమగుఁగాక !!!—

నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు మహాశుగంబులున్
విల్లును దాల్చువాఁడు గడుఁవిప్పగు వక్షమువాఁడు మేలుపైఁ
జల్లెడువాఁడు నిక్కిన భుజంబులవాఁడు యశంబు దిక్కులం
జల్లెడువాఁడు నైన రఘుసత్తముఁ డిచ్చుత మాకభీష్టముల్!

[యవనిక జాఱును.]

తోఁడి దొంగలు

---

*

[ఈ చిన్ని రూపకము అలెగ్జాండరుప్రభువు కాలమునాఁటికి చెందినది. అయినను, సర్వకాలములకు వర్తించు - స్వర్ణాక్షరములతో లిఖింపఁదగిన ధర్మబోధ. ప్రభువు వేయు ప్రశ్న ఒక్కొకటి ఆయనకు రాజనీతిలో గల ఇంగితజ్ఞతను ప్రస్ఫుటము చేయును. కొంకుజంకులు లేక పిడుగులు పడినట్లు దొంగ చెప్పెడి ఒక్కొక ప్రత్యుత్తరము ఆతనిలో అంతర్లీనమైయున్న సత్యస్వరూపమునకు ప్రతిబింబమని చెప్పవచ్చు.]

* *

*

తోఁడిదొంగలు

[గుడారములో అలెగ్జాండర్ ప్రభువు-సమీపమున సాయుధ హస్తముగు పరివారము - ప్రభువుయెదుటశృంఖలాబద్ధుఁడగు నొక ఖైదీ; ఆతని ముఖవైఖరి భయంకరముగ నున్నది.]

అలెగ్జాండర్ :— ఓహో! నీవేనా! —కొల్లగొనుటలో నసమానప్రజ్ఞాధురీణుఁడ వను పేరు మ్రోఁగుచున్న ఆ థ్రేషియను దొంగలనాయకుడఁవు నీవేనా?

దొంగ :—అవును, నేనే. థ్రేషియన్ దేశస్థుఁడను, వీరవర్గమునకు నాయకుడఁను.

అలెగ్జాండరు :—హా!—నాయకుఁడు, వీరవర్గమునకు నాయకుఁడు!!—

ఇటు చూడు—నీవు దొంగవు, పచ్చి దొంగవు. దోఁపిడిగాఁడవు. హంతవు. దేశమున పీడవలె దాఁపురించినావు. నీ ధైర్యమునకు మెచ్చితిని, కాని నీవు చేయు ఘోరాపరాధములకు మాత్రము శిక్షించి తీరెదను.

దొంగ :—శిక్ష పొందుటకు నేఁ జేసిన నేర మేమి?

అలెగ్జాండరు :—ఏమని మెల్లగ నడుగుచుంటివా?—నా యధికారమును నీవు ధిక్కరించితివిగాదా, దేశ శాంతికి భంగము కల్గఁజేయలేదా? హింస, దోఁపిడి

—వీనినే నీ జీవితములో నిత్యకృత్యములుగఁ జేసి కొంటివి కాదా ?

దొంగ :—ప్రభూ! ఏలికకు నే నిప్పుడు బందీనై యున్నాను, నా భౌతిక దేహము తమ వశమైయున్నది. మీరేమి సెలవిచ్చినను పడియుండవలసినదే. కాని...సూక్ష్మ రూపమగు నా ఆత్మమట్టుకు జయింపరానిదిసుమండీ! మీరు నాపై మోపు అపనిందలకు ప్రత్యుత్తర మీయవలసినచో నేను 'స్వతంత్రుని'గనే జవా బిత్తును.

అలెగ్జాండరు : — నిర్బంధములో నున్నంతమాత్రాన నీ వాక్స్వాతంత్ర్యము నరికట్టుట నా యభిమతము కాదు. నివు చెప్పఁదలఁచినది మోమోటమి లేకుండఁ జెప్పవచ్చు.

దొంగ :— సరి. అయినచో, నే నొక ప్రశ్న వేసెదను, ముందు దానికి ప్రత్యుత్తరము చెప్పుఁడు. దిగ్విజయ జీవితయాత్రలో 'తాము' చేయుచున్న పని యేమి ?

అలెగ్జాండరు :—నేనా ?—నే నొక వీరాగ్రేసరుని జీవితము గడుపుచున్నాను. 'కీర్తికాంత' నడుగుము, ఆపెయే నీకు జవాబు చెప్పఁగలదు. ప్రపంచమున మేరు ధైర్యశాలి యెవరు ?—అలెగ్జాండరే అని యామె ముక్తకంఠముతోఁ జాటును. రాజులను ఏలెడి రాజేంద్రుఁ డెవరు ?—నా పేరు చెప్పి మఱియొక పేరు చెప్పును. యోధులను మించిన యోధాన

యోధుఁ డెవరు?—మొట్టమొదట నన్నే పేర్కొనును.

దొంగ:—నన్ను గుఱించి మాత్రము పలుకదా ఆ యశో దేవత?—నా జట్టులో ఎంతలేసివార లున్నారు? అటువంటి వీరశిఖామణులకు మేటి నాయకుఁడనైన నే నెటువంటివాఁడనో — బడాయిలు చెప్పుకొను టెందులకు? వీఁడు ప్రభువశమగుట అనుకొనినంత తేలిక కాదని ఏలికకు,—మూఁడు చెఱువుల నీళ్లు త్రాగిన తమ యోధవర్గమునకు, స్వానుభవమె కద!

అలెగ్జాండరు:—వేయి చెప్పు, లక్ష చెప్పు, నీవు మాత్రము వట్టిదొంగవు. నీచాతినీచుఁడవు...

దొంగ:— పరాక్రమశాలివై దిగ్విజయయాత్రలో మొనగాఁడవై, నీవు చేసిన నిర్వాహకము మాత్ర మేమున్నది?— అంతులేని సామ్రాజ్యకాంక్షతో న్యాయధర్మములు విడిచిపెట్టి, కృషి వాణిజ్యాది వృత్తులతో ప్రశాంతజీవితము నడుపుచున్న ప్రజానీకమును మారణహోమము చేసి, ఱెక్కలు మొలిచిన అగ్నిపర్వతమువలె దేశముపైఁ బడి ధ్వంస ధూళి చేసివైచి, ఎంతమంది నిరపరాధులను పొట్టఁ బెట్టుకొంటివి? ఎన్నెన్ని రాష్ట్రములు పాడువెట్టితివి? క్రూర రాక్షసునివలె దయాదాక్షిణ్యములు విస్మరించి మఱి, యెన్ని రాజ్యములు కొల్లఁగొంటివి?—ఒక వందమంది బలగముతో నేను ఒక్క ముఠాను దోఁచుకొన్నాను; లక్షలాది యోధులతో సంస్థానములను

నీవు సర్వనాశము చేసితివి. నేను సామాన్యసంసారులను దోఁచితిని; నీవు రాజులను, రాష్ట్రములను బలిగొంటివి. నేను కొలఁది పల్లెలను తగులఁబెట్టితిని; నీవు సుందరములగు మంచి పట్టణములను మంటఁగలిపితివి. నాకంటె నీవే ఎక్కువ సుక్షేత్రములయిన ఖండములు పెక్కింటిని శ్మశానవాటికలుగ మార్చితివి.

నిజము చెప్పవలెననిన, నీవును నేనును తోఁడిదొంగలమే. సామాన్యమానవుఁడ నగుటచే నేను చిన్నదొంగను. మహారాజువై పుట్టుటచే నీవు పెద్దదొంగవు. అంతియె భేదము.

అలెగ్జాండరు :— నేను అధికారబలముచేఁ దీసికొన్నను ఔదార్యముతో తిరుగనిచ్చివేసితిని. చిన్నచిన్న రాజ్యములు కూలఁద్రోసినప్పటికి, అంతకు మించిన మహాసామ్రాజ్యములు స్థాపించితిని. కళలు పోషించితిని. తత్వమును తఱచి చూచితిని. వాణిజ్య మభివృద్ధి చేసితిని. విద్యావికాసమునకు బాట లేర్పఱిచితిని.

దొంగ :— నేనుకూడ ధనికులను కొట్టి పేదలకుఁ బంచిపెట్టితిని. వన్యమృగములవంటి మూఁకను చేరదీసి, వారికి సైనిక శిక్షణ గరపితిని. సాధుబాధ మాన్పుటలో, శిష్టరక్షణ సేయుటలో వారు స్తుత్యర్హ ములయిన పరోపకృతులను ప్రదర్శించినారు.

నీవు చెప్పు తర్కములు తత్వములు నాకు తల కెక్కుట లేదు. కాని, లోకమునకు నీవలన కలిగిన నష్టమునకు చెఱుపునకు హింసకు పార మున్నదా? ఇందుకు తగిన పరిహారము కలదా? గుండెమీఁద చేయి వేసికొని ఆత్మపరీక్ష చేసికో. నే జెప్పుట యెందులకు?

అలెగ్జాండరు :—[ముఖాకృతి మాఱినది. యోచనామగ్నుఁడై నాఁడు.]

(భటులతో)—ఈతని బంధవిముక్తుఁ జేసి, ఇటుపై నెంతయు నాదరింపుఁడు.

(దొంగ నిష్క్రమించును.)

అలెగ్జాండరు ...[ఆత్మగతము]—

ఏమీ! నేనును దొంగనే? మా యిరువురకు నింతటి పోలిక యున్నదా!!—ఇంకను యోజింపవలె...

శృంగభంగము

[మానవజీవితములో స్తుతిపాఠమునకు మించిన అపకృతి మఱియొండు లేదని మహనీయుఁడు బెన్జమిన్ ఫ్రాంక్లిన్ స్వానుభవమున చెప్పినాఁడు. అతఁడు విద్యార్థిగ నున్నప్పుడు ఇంటినుండి బడికి పోవు దారిలో నొక కమ్మరి కార్ఖాన యుండెను. అచ్చట జరుగు పనుల నతఁడు వింతగఁ జూచుట కనిపట్టి, కార్ఖాన యజమానుఁడు ఫ్రాంక్లిన్ను చేరఁదీసి మచ్చికఁజేసి, పొంగవేసి పనులు చేయించుకొనెడు వాఁడు. మాయమర్మము లెఱుఁగని బెంజమిను ఉబ్బులింగఁడై ప్రతిఫలాపేక్ష యెఱుఁగనిస్వార్థరాహిత్యములో ఆపనులన్నియు చక్కఁబెట్టెడువాఁడు. అందువలన ఆతని చదువు చెడిపోయినది. పెరిఁగి పెద్దయైన తదుపరి ఇందలి అంతరార్థమును గ్రహించినాఁడు బెంజమిను. ఎవరయిన తనను వినుతించినయెడల, అది విషతుల్యముగ నెంచి కంటగించుకొనువాఁడు; ఎందుల కిట్లు పొగఁడు చున్నారా యని వేవిధముల వితర్కించుకొనెడువాఁడు.

ఈ లోకమున పొగడ్తలచే పనుల సాధించుకొనఁ జూచుట మానవనైజము. సహజసిద్ధమగు ఈ స్వభావమును వారించుట కష్టము. కాని, తరుణములో గ్రహించి, దాని బారిఁబడకుండుటయే వివేకలక్షణము.

నీచులయిన సేవకులు పొగడిచెప్పి యజమానునెటుల వంచింప గడంగిరో, రాజు ప్రయోగించిన చతురోక్తిచే కథ అడ్డము తిరిగి, వా రెట్లు పరిభవింపబడిరో ఈ చిన్ని సంభాషణలో చక్కఁగ చిత్రితమయినది.]

శృంగభంగము

—:o:—

పాత్రములు :

కెన్యూట్ :—ఇంగ్లాండు దేశపు రాజు
ఆఫా :— } రాజసేవకులు
ఆస్వాల్డ్ }

రంగము :

[సౌతాంప్టన్ సమీపమున సముద్రపుటొడ్డు-కెరటములు వచ్చుచుఁబోవుచు నుండును.]

కెన్యూట్ :—మిత్రులారా! రాజులలోనెల్ల నేనే మేటినని తెలుచు చెప్పుచుండెడివారలుగదా, అది వాస్తవమేనా ?

ఆఫా :— నిశ్చయమే, ప్రభూ! తామెల్లరకంటె ప్రతిభాశాలులు.

ఆస్వాల్డ్ :—మే మందఱము తమ బానిసలము ; మీ పాదరజము శిరస్సున ధరింతుము.

ఆఫా :—మేమే కాదు, పంచభూతములు నటులే. భూదేవి తమకు ప్రణమిల్లును ; సముద్రుఁడు తమయాజ్ఞ శిరసావహించును...

కెన్యూట్ :—ఈ మహాఘోషకుఁడగు సముద్రుఁడు నాకు లొంగునా ? పంచమహాభూతములలో చేరిన సాగరుఁడు ఈ మానవమాత్రుని యాజ్ఞ పాటించునా?

ఆఫా :—ప్రభూ-అటులుకాదు. ముమ్మాటికి సముద్రుఁడు ఏలికకు దాసుఁడే ; ఆతఁడు తమ పడవలన్నియు భుజములపై నిడికొని మోసికొనిపోవును ; ధనలక్ష్మిని గొనివచ్చి ఏలినవారి పాదపద్మముల కర్పించును. సముద్రుఁడు తమ శత్రువులకు భీకరుఁడు గాని, తమకు వినయవిధేయభృత్యుఁడే.

కెన్యూట్ :—అగుచో, అలలు మీఁదికి వచ్చుచుండుట లేదా?

ఆస్వాల్డ్ :—నిశ్చయమే, ప్రభువువారి కది గోచరించుచునే యున్నది.

కెన్యూట్ :—సరే, ఒక కుర్చీ తెచ్చి ఈ యిసుకతిన్నెపై వేయుఁడు.

ఆఫా :—మహాప్రభూ! చూచితిరా ? ఇపుడు కెరటములు రాలేదే! బిరి గీసినట్టుగా టక్కున ఆగిపోయినవి.

కెన్యూట్ :—అవును, నిజమే. కుర్చీ నిట వేయుము.

ఆస్వాల్డ్ :—(రహస్యముగా) ఇదంతయు నెందుకొఱకో ?

ఆఫా :— (రహస్యముగా) మనల నమ్మునంతటి మూర్ఖుఁడు కాఁడుసుమా రాజు !

కెన్యూట్ :—శక్తిస్వరూపుఁడవగు నో శరనిధీ! నీవు నా ప్రజావర్గములోని వాఁడవఁట. నా సేవకులు చెప్పుచున్నారు. అందుచే, నా యాజ్ఞ నిర్వర్తించుట నీవిధి. కనుక ఇదిగో, నీవు వెనుకకు మరలిపోవలెనని నే నాజ్ఞాపించుచున్నాను. పొంగి పొరలు నీ యలలను వెను

కకు లాగికొనుము. నీకు ప్రభువ నగు నా పాదములు తడుపకుము.

ఆస్వాల్డ్ :—(రహస్యముగ) సముద్రుఁడు ప్రభువు నాజ్ఞ నాలకించునని తోఁపదు.

ఆఫా :—(రహస్యముగా) ఈసారి తరంగము లెంత చొరఁబాఱి మీఁదికి వచ్చుచున్నవో.

ఆస్వాల్డ్ :— (రహస్యముగ) ఆ వచ్చు కెరటము సరాసరి కుర్చీకడకు వచ్చునట్లు లున్నది. ఇఁక మన మిట నుండుట యవివేకము. ఉప్పునీటిలో తడిసిపోదుము. పైగా...

[ఒక పెద్ద కెరటము వచ్చి కొట్టును.]

కెన్యూట్ :—నేస్తులారా!-చూచితిరా, సముద్రుఁడు నా మాట చెవిని బెట్టెనా? అతఁడు నావాఁడేయైనచో, తిరుగఁబడు సేవకుఁ డన్నమాట. ఎంతటి చొరవతో పొంగిపొరలి, కోపమున నురుఁగులు నా శరీరముపై చిమ్మి, తుంపరలతో నన్ను ముంచివైచుచున్నాఁడో చూడుఁడు. స్తోత్రపాఠకులారా! తుచ్ఛములగు మీ యసంబద్ధ ప్రలాపములకు నేను మోసపోయితినని తలఁచితిరి కాఁబోలును! మీ స్తుతిపాఠములకు నే నుబ్బిపోయితి ననుకొంటిరేమి?

వందిమాగధులవలె స్తోత్రపాఠములు చేసి, నన్ను వంచింప నెంచిన మీ రిపుడైన బుద్ధి తెచ్చుకొనుఁడు. ప్రపంచములో నొక్కనికి మాత్రమే సముద్రుఁడు

లోంగియుండునని తెలిసికొనుఁడు. అతఁడే భూలోక మునకు, స్వర్లోకమునకు అధిపతి, ప్రభువులకెల్ల ప్రభువు, సార్వభౌములకెల్ల సార్వభౌముఁడు. "నీవక్క డకు పొమ్ము, ఇచ్చట నిలువుము" అని సముద్రు నాజ్ఞాపింప నతఁడొక్కఁడే సమర్థుఁడు. ఈ విశాల ప్రపంచములో రాజు మానవమాత్రుఁడు ; మనుజుఁ డొక కీటకమువంటివాఁడు. "నేనే భగవంతుఁడను, నాకీ పంచభూతములు లొంగియుండవలె" నని ఏ పురుషైన ననుకొనఁదగునా ?

ఇదిగో, నా ఈ కిరీటము తీసివేయుచున్నాను. ఇఁక నేనది ధరింపనొల్లను. నన్ను నిదర్శనముగాఁ గొని, తదితరరాజులు వినమ్రులై యుందురుగాక ! మీ కిపుడు జరిగిన శృంగభంగముఁ గాంచి రాజాశ్రయులు బుద్ధిఁ దెచ్చుకుని యిఁకముందు సత్యవాదు లగు దురుగాక !

సంసార నౌక

[తల్లి : శారద—కూఁతురు : అమ్మాణి]

*

అమ్మాణి :—అమ్మా! ఇఁక కుట్టు మానివేసెదనే. విసువు పుట్టుచున్నది.

శారద :—తల్లీ! ఒక్క చెయ్యిమాత్రమెకడ కుట్టితివి. కొంచెము పనికూడ కాలేదే. ఇంకను బోలెడంత యున్నది పూర్తి చేయవలసినది.

అమ్మాణి :—పోనీ. కొంతసేపు ఒరవడి వ్రాసికొనెదను : లేదా పత్రిక చదివెదను.

శారద :—నీ యుద్దేశము నాకు బోధపడినది. నే చెప్పినది తప్ప మఱి యేదయిన చేసెదవు. కాదూ ?

అమ్మాణి:—అది కాదు. అమ్మా!—నాకు కుట్టు బాగుగ వచ్చునని నీకే తెలియును. ఇంతకంటె గొప్ప సంగతు లున్నవికద నేర్చుకొనుటకు? వారి సరస్వతి చూడు. నాకువలె కుట్టుపని సరిగ చేతనే గాదు. అప్పుడే సంగీతము నేర్చుకొనుచున్నది. ఈ నెలనుండి హిందీకూడ చెప్పించుచున్నారఁట!

శారద:—ధోరణి శ్రుతిమించుచున్నదే! కుట్టుపనిలో ఆరితేఱితి నని గర్వించుచున్నావు. నీ మాట నిజమేయైనచో ఈ చిన్నరవిక కుట్టుట యింతసేపా? పిల్ల లెపుడేపని చేయ వలసియుండునో పెద్దలకే బాగుగఁ దెలియునమ్మా!

అమ్మాణి :—ఎప్పటికయిన నివియన్నియు నేరువవలెకదా! ముందుగనే నేర్చుకొంటినేని నీవు సంతసింతువని యటు లంటిని.

శారద :—నిశ్చయమే కాని, అన్నిపనులు ఎల్లరకు నొకేవిధముగ నావశ్యకము కానేరవుసుమా. ఒకరికి అవసరమగు పని మఱియొకరికి నిరుపయోగము కావచ్చును.

అమ్మాణి :—ఎందుచేతనే అమ్మా ?

శారద :—కన్నతల్లీ!-విద్య యనునది వారువారలు గడపవలసిన జీవితములకు అనుగుణముగను, సహకారిగను ఉండఁదగును. ఇంత యేల, స్త్రీ పురుషు లిరువుర జీవితములలో ఎన్నో వ్యత్యాసములు నీకు గోచరించుట లేదా!

అమ్మాణి :—అటులా అమ్మా! ఎల్లరు నొకేరీతిగ నుందురని తలంచుచుంటిని.

శారద :—లోకములో పురుషులకుఁ గల హోదాలఁబట్టి, ఉద్యోగములఁబట్టి స్త్రీల జీవనపథము నిర్ణయింపవలసి యుండును.

అమ్మాణి :—అవునవును. వర్తకులు – వైద్యులు – ఉద్యోగస్థులు-పురోహితులు— ఈ మోస్తరుగ పురుషులు వివిధవృత్తులలో నుండుచున్నారు.

శారద —చూచితివా, మఱి? అట్టి పురుషుల కూఁతులు, భార్యలు ఎల్లరు నొకే విధముగ మనుగడలు సాగిం

చుట సాధ్యమగునా? మన యింట, నే నెటుల దిన చర్య జరుపుచున్నదియు గమనించుచుంటివి కద! ఉదయముననే మనకు వలయు బజాఱు సామగ్రి తెచ్చుటకు పట్టీ వ్రాసియిచ్చి దాలయ్యను పంపుదును. పాలికాఁపులచే పశుసంరక్షణ దగ్గఱనుండి జాగ్రత్తగఁ జేయింతును. తరువాత నీకు తమ్మునకు లాలపోసి, బువ్వ పెట్టి, చాకింటి దుస్తులు తోడిగెదను. పిమ్మట మీ నాన్నగారివి నావి - విడిచిన బట్ట లుదికి ఆఱవేసెదను. కొంతసేపు మీతోపాటు నేనును రాట్నము వడకుచు, నీకు తమ్మునకు పారములు చెప్పుదును. ఇటువంటి వెన్నియో అవశ్యములగు పనులు అనుదినజీవితములో అగపడుచునే యుండును. ఇవి యన్నియు పూర్తియైన పిదప, తీఱిక చేసికొని పత్రికలు పుస్తకములు చదువుదును. మన ధనలక్ష్మమ్మగారి యిల్లు చూచితివికద! ఆ యింటిలో పిల్లలుకాని పెద్దలుకాని ఎట్టి పనియు ముట్టుకొన నవసరమే లేదు. అన్నిఁటికి నవుకరులే. అందుచే అక్కడ నెల్లపుడు సంగీతములు, రేడియోలు మున్నగు వినోదకాలక్షేపములకు సావకాశమున్నది.

అమ్మాయి :—కాని, కామేశ్వరిగా రెప్పుడును ఇంటిపనిలోనే ఈఁదులాడుచుండును. భర్త వైద్యు లగుటచే పొరుగూళ్లు తిరిగి తిరిగి ఏ వేళకు భోజనమునకు

వత్తురో నిశ్చయము లేదు. పాప, మామె అను క్షణము నిరీక్షించి యుండవలసినదే!

శారద :—ఆమెమాత్రమే కాదు-పురోహితులు, వర్తకులు-ఇట్టివారి విషయమునఁ గూడ నటులే. వారు నిర్వహింపవలయు పనుల తీరు అట్టిది. ఎల్లరును వేళకింటికి చేరి, భార్యలను సుఖపెట్టఁగల ఉద్యోగస్థులు కాఁగలరా?

అమ్మాణి :—అమ్మా!-నీవలెనే నేనుకూడ ఇటులే ఇంటి పనులు చేయవలసి యుండునా?

శారద :—ఏమో తల్లీ!-నీ భవిష్యము నిపుడెట్లు నిర్ణయింపఁగలను? నీ యదృష్ట మెటు లున్నదో నే కలఁగంటినా? నేఁ జేయుపనులు నీవుకూడఁ జేయ నవసరము ఉండదనిమాత్ర మూహింపఁగలమా?

అమ్మాణి:—కాని, అమ్మమ్మకు చదువు రాదంటివే, మనకు మాత్ర మెందుల కీ చదువులు?—

శారద :—బిడ్డా! చక్కని ప్రశ్న వేసితివి. దేశ కాల పాత్రతల ననుసరించి అనువగు మార్పులతో 'ఏ యెండ కా గొడుగుపట్టిన'ఁగాని జీవయాత్ర చేయుట దుస్తరము. మన పెద్దల కిప్పటివలె పాశ్చాత్య విద్యయు, నుద్యోగములును లేవు. ఇప్పటి తరములలో శరవేగముతో పలు మార్పులు జరుగుచున్నవి. వీనిని గుఱించి మఱొకప్పుడు విస్తరించి చెప్పెదనులే. పురుషుల వృత్తుల పురస్కరించుకొని వారి కెల్ల విధముల

స్త్రీలు చేదోడుగనుండి 'అర్ధాంగి' యను మాట సార్థకపఱుచుకొనవలయును. గ్లాడ్‌స్టను దొరవారి సతీమణి ఆయన షికారు వెళ్లివచ్చుసరికి, ఉత్తరము లన్నిటికి జవాబులు వ్రాసి సంతకమునకు సిద్ధముగ నుంచెడిదని మొన్న నీవు పత్రికలో చదివినది మఱచి పోయితివా ? పతిభక్తి యనునది భారతస్త్రీల కుగ్గు పాలతో పెట్టిన ప్రసాదగుణము. వారి మాహాత్మ్యము దెల్పు కథ లెన్నియో నీవు పురాణములలో చదివియుంటివిగదా ?

అమ్మాణి :—అవునే అమ్మా! చదువుట, వ్రాయుట నాకు అవసర మన్నమాట.

శారద :—కాదా, మఱి ?

అమ్మాణి :—ఇంకను ఏయే విషయములు నేను తెలిసికొన వలె, నమ్మా ?

శారద :—కుట్టుపని ప్రాముఖ్యము నీకు తెలిసియేయున్నది. దసరాపండుగకు కుట్టించిన యుడుపులకై దర్జీవాం డెంత కూలి పట్టుకొనిపోయెనో జ్ఞాపకమున్నదా ?

అమ్మాణి :—అబ్బో, ఎనిమిది రూపాయీల పైచిల్లర.

శారద :— ఈ సొమ్ము సంసారకృత్యముల కెంత యుప యోగపడియుండునో కొంచెము యోజింపుము.

అమ్మాణి:—ఇకమీఁద కుట్టుపనికై ఒక్క దమ్మిడియైనను కర్చు కానీయను.

శారద:—సంతోషమే తల్లీ! నీ వంటి రతనాల కూఁతురుం డఁగ నా కేమి కొదవ?—మఱియొక సంగతి: గత లక్ష్మివారము శాస్త్రులవారి భార్య ఇక్కడి కెందుకు వచ్చినదో తెలియునుకదా!

అమ్మాణి:—తెలియకేమి? పాపము, నీవు లెక్కచూచి పెట్టితివి గనుక సరిపోయెగాని, లేకున్న దొంగలెక్క చెప్పి ఆమెను మాయపుచ్చ యత్నించినారుకదా, వారి గోడ పెట్టిన కూలీలు? ఎంత అమాయకురాలో!—

శారద:— లెక్కలు రాకున్నచో నీ పనియు నంతే. క్రిందటి సారి నే నెంత జాగ్రత్తతో పద్దు వేసినను చాఁకలిది బుకాయించినది కాదా? పద్దు పరక ఆధారము లేనిచో ఎంత చిక్కుగ నుండునో ఆలోచింపుము. అదియుఁగాక, సంసారమునకు సంబంధించిన జమా ఖర్చులు స్త్రీలే చూచుకొనవలెను. ఎన్నియో ముఖ్య మగు వ్యవహారములు నిర్వర్తించుకొనవలసిన పురు షుల నెత్తిపైన చిన్న చిన్న విషయములుకూడ వేసి వారల విసిగింపఁగూడదు. ఇట్టి వన్నియు మనమే చక్కఁబెట్టుకొనవలె. ‘ఆయమును మీఱు వెచ్చ మనర్థక’మని పెద్దలు చెప్పుదురు. అందుచే లెక్కలు చక్కగ నేర్చుకొనినఁగాని ఈ యంశములు నెఱ వేరుపఁజాలము.

అమ్మాణి:—సరే కాని, అమ్మా! —తమ్ముఁడు చదువుచున్న ‘శారీరశాస్త్రము’కూడ నన్నొకప్పుడు చదువు మంటివే. అదెందులకు, ఆఁడువారికి?

శారద:—అమ్మాణీ!-లెక్కలకంటెకూడ నిది అత్యావశ్యక మైనదమ్మా! ఆ బల్లమీఁద నున్న ఎఱ్ఱఅట్ట పెద్ద పుస్తక మిటు తెమ్ము.

అమ్మాణి:—[తీసికొని వచ్చును.]

శారద:-[పుస్తకము తెఱచి చూచి]-ఇక్కడనుండి చదువు.

అమ్మాణి:—[ఇట్లు చదువును]

"భారత దేశమున పురాతనకాలమందు స్త్రీపురుషు లందఱకును విశేషముగ శారీరజ్ఞానము కలిగియుండె ననుటకు ప్రమాణము లనేకములు గలవు. కర్మ కాండమున షోడశకర్మములలో శిశువునకు జాత కర్మ తండ్రి జరుపవలయునని విధింపఁబడి యుండు టచే గర్భాశయమునకు సంబంధించిన ప్రజననాంగ ముల విశేషము లన్నియు ప్రతి గృహస్థుఁడును తెలిసి కొని యుండవలెనని యేర్పడుచున్నది. గర్భాదాన మంత్రములందలి విషయముల పరికించినచో కర్మకాం డమును జరిపింప నేర్పడియుండు ఉపాధ్యాయునకును శారీరజ్ఞాన ముండవలసినదని తేటపడగలదు. ఔర్ధ్వ దాహిక కర్మములలో అస్థిసంచయనమున స్త్రీలు ఆయా యంగవిశేషములకు సంబంధించిన అస్థిభాగ ములను ఏఱి సంచయనమునకు సిద్ధము చేసియుంప వలెనని చెప్పఁబడి యుండుటచే స్త్రీలకుఁగూడ శారీర శాస్త్రజ్ఞానముండవలయుననుట స్పష్టమగుచున్నది"

శారద :—అట్టివారి సంతతికి చెందిన, మనకుఁగూడ శారీర శాస్త్ర పరిజ్ఞానము అవసరమందువా, కాదా ?

అమ్మాణి :—ఔనమ్మా, అవసరమే మఱి–మొన్నను నాన్న గారికి వచ్చిన అచ్చు ఉత్తరముతో - శరీర మర్మ శాస్త్రము, ఏవో రహస్యములు... పెద్ద పెద్ద అక్షరములు, అందమయిన బొమ్మలు గల జాబితా వచ్చినది కదా, అవన్నియు నే నెప్పుడే చదువుట ?

శారద :—నీ కెంత జ్ఞాపకమే, కన్నా !-ఆ పుస్తకములు నీవు కలనైన స్మరింపగూడదు సుమీ ! తెలుఁగు సొంటు లేని ప్రముఖులు ధనాపేక్షతో చేయుచున్న దేశ ద్రోహ మిది ! అందుచేతనే కదా, మీ నాయనగారు ఆ పట్టీని చూచి చూడకయె తునకతునకలుగ చించి పాఱవైచిరి ?

బాలబాలికలకు, సతీపతులకు, శోభ గూర్చు చక్కని యంశములు సర్వజన సుబోధకముగ శ్రీ వావిలికొలను సుబ్బారావుపంతులుగారు రచించియున్నారు. అవన్నియు కావలెనని మీ నాన్నగారిని కోరెదను. చదివి మననము చేసికొని యాచరింపఁదగిన దివ్యబోధము లెన్నియో అందున్నవి.

అమ్మాణి :—'భక్తిసంజీవని' ప్రచురించుచున్న వాసుదాసుఁడేనా అమ్మా ? వారి 'ఆర్యకథానిధి' నాచేత చిన్నప్పుడే చదివించితివి కాదా ?

శారద :—ఆయనే తల్లీ! ఆ మహానుభావుఁడు రచించిన సిరి రత్నములే.

అమ్మాయి :—అమ్మా! మఱి—

శారద :—'మఱి' కాదు, తల్లీ!—ఇప్పటికి విషయములు గ్రహింపుము. అదిగో, నాన్నగారు వచ్చుచున్నారు. దుస్తులందుకొని పాగా కొయ్యకు తగిల్చి, ముందు కాళ్లు కడుగుకొనుటకు నీళ్లిమ్ము.

'స్వతంత్రమే స్వర్గలోకము'

[ఇది—బానిసల వర్తకము సాగిన కాలమునాఁటికి సంబంధించిన ఒక రచన. అప్పుడే యీను మాట యేమి?— స్వాతంత్ర్య ప్రియులు ఈ నాఁడయిన దీనిఁ జదివి హర్షింపఁగలరు.]

యజమానుఁడు :— ఛీ, తులువా!—ఈసారి ఉడాయించఁబోయినందుల కేమి చెప్పుకొనెదవు? ఎంతటి ఘోర శిక్ష విధించినను పాప మున్నదా?

బానిస :— నే నేమి చెప్పుకొన్నను సార్థకము లేదని నాకు తెలియును. పోనిమ్ము— నా కర్మ మెటులో ఒక యటుల జరుగఁగలదు.

యజమానుఁడు :—ఎట్టి నీచుఁడవురా, నల్ల పాషాణమువు. మేలు మఱచెడి కృతఘ్నుఁడవు...

బానిస :— నేను బానిసను. ఇదే నేఁ జెప్పు సమాధానము.

యజమానుఁడు :—అసందర్భపు జవాబు : ప్రసాదగుణములను సూచించెడి లక్షణములు కొన్ని నీలో నున్నట్లు గ్రహించి, అందుల కనుగుణముగ నిన్నాదరించితిని; భోజనవసతులకు సదుపాయమయిన ఏర్పాట్లు చేసితిని. నీ శక్తికి తగిన పనులే చెప్పి చేయించితిని. ఇంచుక అనారోగ్యముగ నున్నటులు పొడకట్టెనేని, ఎంతో కనికరముతో మందులు మాఁకులు ఇప్పించియుంటిని;

వలయు పరిచర్యలెల్ల చేయించితిని. ఇన్ని విధముల నిన్ను కనిపట్టుచున్నందులకు నీవు చూపెడి విశ్వాస మిదే కద?

దాసి:—నన్ను కూడ ఒక మానిసిగ నెంచి మాటాడు చుంటివి గనుక, ఇప్పుడు సరియైన ప్రత్యుత్తర మిచ్చెదను: నీవు నాకు చేసిన దేమి?—నా 'స్వాతంత్ర్యము'ను లాగికొనినందులకు సరిపడు ప్రతిఫల మే మీయఁగలవు?

యజమానుఁడు:—ఎన్నఁడును నీ స్వాతంత్ర్యమును లాగ కొనలేదు. నేను నిన్ను న్యాయ్యముగ కొనుటకే నీవు దాసివవు.

దాసి:—నీవు కొనుటకు నే నంగీకరించితినా?

యజమానుఁడు:—నీ ఒప్పుదలతో పని యేమి? నీకు గల హక్కు అప్పటికే పోయినది.

దాసి:—లేదు, లేదు. ప్రతిఘటించగల శక్తి పోయిన దేమో కాని, హక్కు ఎటులు పోయినదయ్యా? నా దేశమున నేను న్యాయ్యమగు వృత్తిలో జీవనము గడపుకొనుచుండఁగా ద్రోహులు కొందఱు, నన్ను బలవంతముగ ఎత్తుకొనివచ్చిరి. గొలుసులతో బిగియ గట్టిరి. మీ దేశస్థుఁ డొకఁడు నన్ను కొని, పడవ మీఁదికి గెంటి, ఇక్కడకుఁ దీసికొనివచ్చి—సంతలో పశువులకువలె నన్నతఁడు అమ్మఁజూపఁగా నీవు కొంటివి. ధర్మము మాలిన ఈ దౌర్జన్యపరంపరలో

ఏ కార్యము నీకు హక్కు నిచ్చునది? నన్ను బలిమిని దొంగిలిన ఆ ఖలునకు గాని, ఆతని నిట్లు చేయ ప్రేరేచిన బానిసల వర్తకునకు కాని, నీ సేద్యము కోసము మానవపశువులను పడవలకొలఁది కొమ్మని వర్తకుని ప్రోత్సహించిన నీకుఁగాని—మీ ముగ్గురలో నెవరికైన ఎట్టి హక్కయిన గలదా ?

యజమానుఁడు :—ఒకనికి మఱియొకఁడు ఊడిగము సేయ వలయు ననునది ప్రకృతిసిద్ధము. అది దైవాజ్ఞ. ఆదినుండియు నిటులే జరుగుచున్నది; ముందుకూడ అంతే. ఇటువంటి ఆచార మున్నదని కనుగొంటినే గాని, దాని నిపుడు నే సృష్టించలేదు.

బానిస:— నీవు సృష్టించలేదు, సరి. అయినచో—ఈ వాద బలమునే ఆధారముగఁ దీసికొని, దొంగ నీ గుండెకు తుపాకి గురిపెట్టవచ్చు నన్నమాట ? నీకీ హక్కు నిచ్చిన దేవుఁడే, నీ అర్థ ప్రాణములు రెండిఁటిని అపహరించఁగల శక్తిని దొంగకు ఒసఁగియున్నాఁడు. అంతియ కాదు. నా స్వాతంత్ర్యమును లాగికొన నా శత్రువులకు బలము నిచ్చిన ఆ దేవుఁడే తప్పించుకొని పారిపోవుటకు నాకు కాళ్లుకూడ అనుగ్రహించి యున్నాఁడు. ఈశ్వరుఁడు ప్రసాదించిన ఈ అవయవములను ఏల వినియోగింపఁగూడదు ?

అదియుఁగాక — అనుకూలమగు తరుణము చిక్కి-నపుడు అనుభవించిన అక్రమములను వలపోసికొనుట కాటంక మేమున్నది?

యజమానుఁడు :— కృతజ్ఞత! కృతజ్ఞత!!— చేసిన మేలు నెన్నఁటికి మరువకుము. నీ విక్కడకు వచ్చినప్పటి నుండియు ని న్నెంతటి దయతో చూచుచుంటిని? నీ దుర్దశ తొలగించుట కెంతగ యత్నించుచుంటిని? ఇట్టి యుపకృతి నావల్ల పొందుచున్న నీవు కృతజ్ఞత చూపుట విధికదా? మఱొక యజమానుని కొలువులో ఉండినట్టయిన, ఎట్టి దుర్భర స్థితిలో నుండియుందువో కొంచె మూహించుకో.

బానిస :— ఓహో!— మహా గొప్ప ఉపకారము చేసి పోతివి! ఆ మాటకు వచ్చిన, నీ గొడ్లకు చేసిన దానికంటె ఎక్కువగ నాకు చేసిన దేమున్నది? వానికి మేఁత వేయుచున్నావు. నాకును ఇంత తిండి పడవేయుచున్నావు. స్వలాభముకొఱకు పశువుల చేతను మానవపశువులచేతను ఒక్కలాగున పని చేయించుకొనుచున్నావు. నీవు శ్రీమంతుఁడవు— అందునను కాసంత వివేకవంతుఁడవు. అగుట, భృత్య వర్గమును పోషించుటలో తోఁడివారికంటె కొంచెము మంచివాఁడ వనిపించుకొనుచున్నావు, అంతే.

యజమానుఁడు :— 'మంచివాఁడ' ననే కాదు, అత్యంత కరుణాళుఁడ నని కూడా —

బానిస :—'క-రు-ణా!'—నీవు అంతటి శ్లాఘకు పాత్రుఁడవా?—నీ చిత్త చాంచల్యముచేత నేమి, నీ యనుచరుల తిరేక నిర్బంధమువల్ల నయిననేమి — తోడి మానవుల స్వాతంత్ర్యసర్వస్వమును ఏల కొల్లఁగొట్టుచుంటివి? ఆదాయమును వృద్ధి చేసికొని కులుకుటకే గద? ఇట్టి నికృష్టపరిస్థితులలో— పీడించెడి నిర్దయాత్మకుఁడగు యజమానునిపై సేవకుల కెట్లు కృతజ్ఞత కలుగుననుకొనఁగలవు? — ఇదిగో, ఇటు చూడు. నేనును నీ వలెనే మానవ జన్మమెత్త లేదా? నాకును నీ కున్నటులే ధైర్యము, ఉత్సాహము ఉండవా?

యజమానుఁడు :—నీకు తెలియదు కాని — ఇప్పటి నీ జీవితము సుఖప్రదము చేయుటయె గాక, ముసలితనములో నీ సౌఖ్యముకొఱకు తగిన యేర్పాటు లాలోచించుచున్నాను.

బానిస :—అయ్యో, రామ!—'నా' యనువారందఱకు యెడబాపులై, దేశము కాని దేశము చేరుకొని, సమస్తము వదులుకొని, పరాయి స్థలమున పడరాని పాట్లు పడుచున్న ఈ ప్రాణికా, ముదిమి చూడఁగలనను యభిలాష! హా!—ఎంత శీఘ్రముగ ఈ లోకమునుండి సెలవు తీసికొనిన, అంత త్వరితముగ నా యాత్మకు విముక్తి.

యజమానుఁడు :—అటులైనచో, నిన్ను ఒద్దిలో నుంచుటకు నిర్బంధము, కాఠిన్యము తక్క తదితర మార్గము లేదన్న మాట ?

బానిస :—ఆత్మకు నిర్బంధము లేదు. స్వేచ్ఛకు గల విలువను తెలుసుకొన్న వ్యక్తిని బానిసగ నుండ నొప్పించుట కేవలము అసాధ్యము.

యజమానుఁడు :—పోనిమ్ము, నీవు కోరుకొనెడి స్వేచ్ఛను తిరుగ నీకిచ్చెద ననుకో. అది ఉపకారముగ భావించెదవా ?

బానిస :— ఓ ! మహోపకృతిగా పరిగణించెదను. అపహరించిన స్వేచ్ఛను మరల ఇచ్చుట యనిన, చేసిన పొరపాటును దిద్దుకొనుటయె. అయినను, న్యాయముకొఱకు ధర్మముకొఱకు స్వార్థమును త్యజింపఁగల వారు లోకమున అరుదుగ నుందురు. ఆ సంగతి నే నెఱుఁగుదును. అందుచేతనే, నీ సంకల్పము మహత్తరమయినదిగ భావించెదనంటిని.

యజమానుఁడు :—సరే, అటులే చేయుచుంటి. ఇటుపైన నీవు స్వేచ్ఛగా నుండుము. సర్వ స్వాతంత్ర్యమును అనుభవింపుము.

బానిస :—బానిసను కానుగాని, ఇపుడు నేను నీకు నిజమయిన దాసుఁడను. తెలిసినదా ?— నీవు ఒనర్చిన మేలునకు ప్రతిగా, మనసు విడిచి నీ యథార్థస్థితిని వెల్లడించెద, విను :

నీవు, నీ క్రింది సిబ్బందియు పెట్టుచున్న బాధ లన్ని టిని సేవకులు మిక్కిలి ఓరిమితో భరించుచున్నారు. భరించుచున్నారు—కాని, ఎప్పుడు మీపైన కసి తీర్చుకొనఁగలమా యని వా రెల్లరు సమయము కోసము వేచియున్నారు. తీరని పగతో నున్న ఇటు వంటి శత్రుబృందము నిన్ను చుట్టుముట్టియున్నదని కానుకోలేకుంటివి. విన్నావా?—

యావజ్జీవదాస్యమునకుఁగాను నీవు ఇచ్చుటకు కొని వచ్చిన వీరిలో — కొందఱు న్యాయశీలురు సయి తము, నీవు చేసిన అన్యాయము తలఁచి తలఁచి క్రోధావేశు లగుచున్నారు. నీవు చేసితి ననుకొన్న స్వల్ప ఉపకృతులు వారి క్రోధపూరితహృదయములకు ఊఱట కల్గించునని మాత్రము భ్రమింపకుము.

వారిలోని మానవత్వమును మటుమాయము చేసి, వారిని పశుప్రాయస్థితికిఁ దెచ్చినది నీవే. బరువులు మోసెడి పశువులకు గల అజ్ఞానము వారికి లేదు కాని, జంతువులను చంపుకొని తినెడి క్రూరమృగముల క్రౌర్యము మాత్రము వారిలో విజృంభించుచున్నది. ఉత్తమమయిన సాత్త్వికశక్తియే నీ కెప్పటికైన రక్షణ నీయఁగలది. అది నీలోన పూజ్యమయ్యెనేని, నీ వా క్రూరుల బారిని పడితివన్నమాట. యజమానునకు సేవకునకు గల చుట్టఱిక మింతలో నున్నది!

—

వేదాంతి చిట్టెయ్య

[ధర్మరావుదొరగారు స్వారి బయల్దేరినారు. దారిలో పుష్పాలు కోయుదమని దిగినారు. ఆయన తిరిగి వచ్చుసరికి గుఱ్ఱము ఉడాయించినది. 'ఆఁగు, ఆఁగు...పంచకల్యాణీ!' అనుచు పేరుపెట్టి గట్టిగఁ బిలిచినారు, దొరవారు. అది ఆఁగినట్లుండుట, తీర దగ్గఱకు వచ్చుసరికి గొడు తీయుట —ఇట్లు చేయుచున్నది. కొంతసేపటికి ప్రక్కన పొలములోనున్న చిట్టెయ్యా అను కుఱ్ఱవాఁడు ఇదంతయు చూచినాఁడు. గబుక్కున వెళ్లి ధైర్యముతో పట్టుకొని గుఱ్ఱమును ఆపి యజమానునకు ఒప్పజెప్పినాఁడు. ఆ కుఱ్ఱవాని సాహసము, ఆతని ముఖలక్షణములు చూచి మహా సంతోషమయినది ధర్మారావుగారికి.]

* *

ధర్మారావు:—అబ్బాయీ!—మంచి తెలివితేటలతో పట్టుకొంటివోయి, మా గుఱ్ఱమును. చాలా సంతోషించినాము. నీకేమి బహుమాన మీయఁగలము?

[జేబులో చేయి పెట్టినారు.]

చిట్టెయ్య:—నాకేమియు వలదండి.

ధర్మా:— వలదా?— మఱియు మంచిది. ఇటు లెవ్వరును అనుట వినలేదు. సరి, నీవు పొలములో ఏమి చేయుచుందువు?

చిట్టెయ్య:—గొఱ్ఱెలను మేఁపుచుందునండి. ఇప్పుడు దుంపలు త్రవ్వుచున్నాను.

ధర్మా :—నీ కీ పని సరదాగా నున్నదా?

చిట్టెయ్య :—ఓ...

ధర్మా :—పోనీ, పోయి ఆడుకోరాదూ ?

చిట్టెయ్య :—నాకీ పని కష్టముకాదండి. ఆటకంటె ఎక్కువ కులాసాగా నున్నది.

ధర్మా :—ని న్నెవ రీ పనిలో పెట్టినారు ?

చిట్టెయ్య :—మా బాబు.

ధర్మా :—అతగాఁ డేడీ ?

చిట్టెయ్య :—అల్లదిగో, ఆ చెట్లమరుగున పాకలోనున్నాఁడు.

ధర్మా :—అతని పేరు ?

చిట్టెయ్య :—కిష్టమ్మ.

ధర్మా :—నీ పేరో ?

చిట్టెయ్య :— చిట్టెయ్య అనెదరండి బాబూ.

ధర్మా :—నీ కెన్నేళ్లు ?

చిట్టెయ్య :—రేపు సంక్రాంతికి ఎనిమిదీ దాఁటునండి.

ధర్మా :— అటులా ? ఈ పొలములో ఎంత సేపటినుండి యుంటివి ?

చిట్టెయ్య :—తెల తెలవారుచుండ వచ్చితినండి.

ధర్మా :—మఱి, నీకు ఆఁకలివేయుట లేదా ?

చిట్టెయ్య :— కాస్తంత సేపుండి, గంజికి వెళ్లెదనండి.

ధర్మా :—ఒరే కుఱ్ఱవాఁడా! నీదగ్గఱ ఇప్పుడు ఆరణాలున్న వనుకో, ఏమి చేసెదవు ?

చిట్టెయ్య :— తెలియదు బాబూ, నాకడ అంత సొమ్మెప్పుడును లేదండి.

ధర్మా :—నీయొద్ద ఆటసామగ్రి యేమీ లేదా ?

చిట్టెయ్య :—అదేమిటండి బాబూ ?

ధర్మా :—గోళీకాయలు, బంతులు, బొంగరాలూ - అటువంటివి ఆటవస్తువు లనఁగా.

చిట్టెయ్య :—లేదండి. మొన్న తీర్థములో చెల్లికే కొన్నది మా మామ్మ—గంతులు వేసే కప్ప ఒకటి, నొక్కిన కూసే పిట్ట ఒకటిన్ని. కొన్ని లక్కసామానులు కూడ తెచ్చినది. నాకు ఆడుకొనుట కొక గుఱ్ఱము బొమ్మ ఉండెడిది. అది విరిగిపోయినదండి.

ధర్మా :—అయితే, నీకేమీ అక్కఱలేదా ?

చిట్టెయ్య :—వలదండి దొరగారూ! గొఱ్ఱెలను మేపుకొని వచ్చునప్పటికే రోజల్లా సరిపోవును. నాకు ఆడుకొనుట కంటె ఇదే సరదా.

ధర్మా :—సరిగాని, నీయొద్ద డబ్బున్నచో, పండ్లు అప్పచ్చులు కొనుక్కొన వచ్చుకద !

చిట్టెయ్య :—అక్కఱలేదండి. నాకు వలసిన వన్నియు మా అమ్మ ఇచ్చును. అవే చాలును.

ధర్మా :—పోనీ-పొలములో చెట్లు పుల్లలు కోసికొనవచ్చు, కత్తి ఇచ్చెదను, తీసికో.

చిట్టెయ్య :—నా దగ్గఱనే ఉన్న దొరకెర. మా అయ్య ఇచ్చి నాడండి.

ధర్మా :—అయితే, చూడు. నీ చెప్పులు బొత్తుగా చినిగిపోయి నట్టున్నవే. ఒక క్రొత్త చెప్పుల జత కొనుక్కొనుమిూ.

చిట్టెయ్య :—ఇంటివద్ద మఱొకటున్నదండి; అది పండుగలకు వాడుకొనెదను.

ధర్మా :—ఒరే చిట్టీ!–నీ తలగుడ్డంతయు మాసికలు పడినదే?

చిట్టెయ్య:—పూర్తిగ చినిగిన తరువాత నెత్తి మాడునండి బాబూ. అప్పుడు క్రొత్తది కొనుక్కొనవచ్చు. అంతవఱకు కాలక్షేపమున కిది చాలు.

ధర్మా :—అబ్బాయీ! వర్షము వచ్చిన యేమి చేసెద వోయి?

చిట్టెయ్య :— వెలిసేవఱకు అట్లా మంచెక్రింద దూఱి కూర్చుండెదనండి.

ధర్మా. —ఒకవేళ ఇంటికి వెళ్లకముందే ఆఁకలిఅయినచో ఏమిచేసెదవు చిట్టెయ్యా?

చిట్టెయ్య :—ఉన్నవికదండీ దుంపలు?

ధర్మా :—ఇప్పు డున్నవిలే. అవియు దొరకనప్పుడు?—

చిట్టెయ్య :—నా కేమియు ఫరవాలేదండి. ఆ యుబుసే తలఁపను.

ధర్మా :—మఱి,–ఈ వేసంగిలో నీకు దాహము వేయదూ?

చిట్టెయ్య :—ఆ చలమలో పంచదార్లవంటి నీళ్లున్నవండి. దప్పిక తీరుటకు అవి చాలునండి.

ధర్మా :—ఆరి చిట్టెయ్యా, ఎంత వేదాంతివోయి!

చిట్టెయ్య :—ఏమిటం డయ్యా?

ధర్మా :—నీవు వేదాంతి వనుచున్నాను. అనగా యేమో నీకు తెలియదు కాబోలు.

చిట్టెయ్య :— తెలియదండి బాబూ! తెలియకుంటే ఇబ్బంది లేదు గద?

ధర్మా :—లేదు, లేదు. [చిఱునవ్వుతో]-సరే, చిట్టెయ్యా!- నీకేమీ అక్కఱలేనట్టున్నది. పోనీ, నీకు సొమ్ము ఏమియు నీయనులే. అయితే,— నీవు బడికి వెళ్లు చున్నావా?

చిట్టెయ్య :—లేదండి. కోతలయిన తరువాత ప్రవేశపెట్టెద నన్నాఁడండి. మా అయ్య.

ధర్మా :—మఱి, నీ కప్పుడు పుస్తకములు కావలె కదా?

చిట్టెయ్య :—అవునండి, బడిలో తోఁడి పిల్లలందఱకు ప్రార్థన పుస్తకము పేళ్ల పుస్తకము, ఎక్కాల పుస్తకము ఉన్నవండి.

ధర్మా :—సరే చిట్టెయ్యా!— నీకు నేను ఆ మూఁడు పుస్తకములు కొని యిచ్చెదను. నీవు సంతుష్టి గల పిల్లవాఁడివని సంతోషించినాను. ఇటు లని మీ బాబుతో చెప్పు. పో, గొఱ్ఱెలు కాసికో.

చిట్టెయ్య :—చిత్తము దొరగారూ! సెలవు తీసికొనెదనండి.

ధర్మా :—మంచిది.

Weldun Press, Madras-21.

JAYA-PRASOONAMULU

THE INSPIRING AND CHARACTER-BUILDING SERIES OF TELUGU BOOKS FOR THE SCHOOL, HOME AND LIBRARY

JANMABHUMI by Mudda Viswanadham — As. 12.